



● నిబంధనలకు విరుద్ధంగా మున్నంగి రీచ్‌లో భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలు

ఇసుక రీచ్‌లలో.. బరితెగింపు

ఇసుక అక్రమ తవ్వకాలను ఆపాలంటూ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోవటంతో జనమే చివరకు రీచ్‌ల దగ్గరకు వెళుతున్నారు. అక్రమార్కులు మాత్రం మరింత బరితెగించి జనంపైకి ట్రాక్టర్‌లను దూకిస్తూ, టైర్ల కింద పడేసి తొక్కిస్తూ, కత్తులు కటార్లతో దాడులకు తెగబడుతున్నారు. కానీ అధికార యంత్రాగం చోద్యం చూస్తుండటం కొసమెరుపు. నిన్నటి వరకు ప్రభుత్వ పెద్దల ప్రమేయం, నేతల ఆదేశాలున్నాయని అధికారులు దాడులు చేయలేదనుకుంటే, ఇప్పుడు ఎన్నిల కోడ్ అమలులో ఉన్న తరుణంలో ఏ రాజకీయ నేతలతో పనిలేకున్నా, ఇంకా వారికి వత్తాసుపాడుతూనే ఉన్నారు. అదేమంటే... ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలున్నాయని, ఏమీ చేయలేమని కొందరు బహిరంగంగానే చెబుతుంటే, మరి కొందరు పోలీస్, సెబ్ అధికారులయితే మరో అడుగు ముందుకేసి వసూళ్లకు సై అంటున్న పరిస్థితి. నిన్నటి వరకు ఎమ్మెల్యే, మంత్రి పేరుచెప్పి ఇసుక తరలించారని, ఇప్పుడు ఆ పప్పులేవీ ఉడకవని, ఈ రెండు నెలలు టైం మాదంటూ, నిలబెట్టి మరీ వసూళ్లకు సిద్ధపడుతున్నారని తాజాగా లారీ యజమాన సంఘాలే ఆవేదన వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. అయితే ఏ రీచ్‌కు అనుమతులున్నాయో! వేటికి లేవనేది కూడా రహస్యమే.



గుండిమెడ వద్ద నదిలో భారీ యంత్రాలతో ఇసుకను తోడేస్తున్న దృశ్యం

ఇసుక.. మాఫియా

అక్రమాలను అడ్డుకోవాల్సిన అధికారులే అండ

- ఆందోళనలపై ఉక్కుపాదం మోపుతున్న అధికారులు
- మంగళగిరి నియోజకవర్గంలో అధికారుల విచిత్రవైఖరి
- కోడ్ వచ్చినా.. రీచ్‌లలో ఆగని ఇసుక అక్రమాలు
- గుల్లవుతున్న గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లు

మంగళగిరి, మార్చి 30:మంగళగిరి నియోజకవర్గంలో గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో రేయింబవళ్లు ఇసుక తోడివేత, అక్రమ రవాణా జోరుగా సాగుతున్నాయి. గత మూడేళ్లపాటు జేపీ వెంచర్స్ పేరుతో ఈ రెండు రీచ్‌లలో చట్టాలు, నిబంధనలను తుంగలో తొక్కితమకు అడ్డెవరు అన్నట్టుగా ఇసుకను దోచేశారు. ప్రతిపక్షాలు ఇసుకరీచ్‌ల వద్ద ఆందోళనలు చేపట్టినా, పర్యావరణ ప్రేమికులు న్యాయస్థానాల్లో కేసులు వేసినా.. ఇసుక రీచ్‌ల దోపిడీ మాత్రం ఇసుమంతైనా తగ్గలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తరువాతైనా ఇసుక దోపిడీకి కొంతైనా కళ్లెం పడుతుందని ఆశించినా అడియాసలే అయ్యాయి. కోడ్ అమల్లోకి వచ్చాక వున్న రెండు మాసాల సమయాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలన్న ఆతృత కొద్దీ ఇసుక దోపిడీని మరింత ముమ్మరం చేశారు.

కాంట్రాక్ట్ ఎవరిదైనా..

గతంలో ఇసుక రీచ్‌ల కాంట్రాక్ట్సు ఏజెన్సీ జేపీ వెంచర్స్ అన్నారు. జేపీ వెంచర్స్ కాంట్రాక్టు పీరియడ్ ముగిసినప్పటికీ గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో మాత్రం ఇసుక దోపిడీ ఒక్కరోజు కూడ ఆగలేదు. కాంట్రాక్టు ఎవరిదైనా.. అసలు కాంట్రాక్టు వున్నా లేకున్నా.. సంబంధిత శాఖల నుంచి ఆదేశాలు లేకున్నప్పటికీ వైసీపీ బడా నాయకులు మాత్రం ఇసుకరీచ్‌ల వద్ద దాదాపు రౌడీయిజం చేస్తూ మరీ ఇసుకను దోచేస్తూ వచ్చారు. ఇసుక దందాను అడ్డుకోవాల్సిన గనుల శాఖ, రెవెన్యూ శాఖ, రివర్ కన్జర్వేషన్ అధికారులు, పోలీసులు ఇసుక అక్రమ రవాణాకు సంపూర్ణంగా సహకరిస్తూ వచ్చారు. పైగా ఇసుకరీచ్‌ల వద్ద ఆందోళన చేసేందుకు వచ్చిన ప్రతిపక్ష పార్టీల వారిని అడ్డుకుంటూ ఇసుక అక్రమ తోడివేత, అక్రమ రవాణా చేస్తున్నవారికి ప్రభుత్వ యంత్రాంగం రక్షణ కల్పిస్తూ వచ్చింది.

అక్రమాలను గుర్తించిన ఎంఓఈఎఫ్ అండ్ సీసీ

ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల్లో జరుగుతున్న ఇసుక దందాను గురించి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఈ రీచ్‌లలో క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, అటవీ, క్లైమేట్ చేంజ్ (ఎమ్ఓఈఎఫ్ అండ్ సీసీ) అధికారులతో ఓ జాయింట్ కమిటీని గత జనవరిలో ఏర్పాటుచేసింది. ఈ కమిటీ జనవరి 17నుంచి 19వ తేది వరకు మూడు రోజులపాటు గుంటూరు జిల్లాలో ఎనిమిది, కృష్ణాజిల్లాలో ఆరు ఇసుక రీచ్‌లను సందర్శించి ఆయా రీచ్‌లలో జరుగుతున్న అక్రమాల దందాను గుర్తించింది. విరామమే లేకుండా రోజుకు 24 గంటలపాటు భారీ మిషనరీని వినియోగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను ఆసాంతం తోడేస్తున్న తీరును గుర్తించి కమిటీ ఆశ్చర్యపోయింది. రీచ్‌లలో సీసీ టీవీలు లేకపోవడం, సరైన వేబిల్స్ లేకుండా, కంప్యూటర్ జనరేటెడ్ బార్‌కోడ్ పర్మిట్లు లేకుండా రవాణా చేస్తున్న తీరును చూసి కమిటీ కంగుతింది. రీచ్‌లలో తాము గుర్తించిన ఈ అక్రమాలను గురించి కమిటీ ఎన్జీటీకి గత నెల రోజుల కిందట నివేదికను సమర్పించింది. అయినా, ఇసుక అక్రమార్కులు ఎక్కడా వెరవలేదు.

కృష్ణాతీరం భారీగా కోత..

మంగళగిరి నియోజకవర్గంలో గుండిమెడ, వల్లభాపురం రీచ్‌లలో జరుగుతున్న ఇసుక దందాతో దిగువ కష్ణాతీరం భారీ కోత పడుతూ వస్తుంది. దీంతో పర్యావరణానికి తీవ్ర నష్టం కలుగుతుంది. మరోవైపు గుండిమెడ రీచ్ నుంచి రోజుకు అయిదొందలకు పైబడి భారీ ట్రక్కుల్లో ఇసుక అక్రమ రవాణా జరుగుతుండగా వల్లభాపురం రీచ్ నుంచి రోజుకు 300 నుంచి 350 ట్రక్కుల వరకు దోచేస్తున్నారు. గుండిమెడ రీచ్‌నుంచి ఒక్కో ట్రక్కులో 20 నుంచి 25 టన్నుల వరకు ఇసుకను తరలించుకుని పోతున్నారు. గుండిమెడ రీచ్‌నుంచి ట్రక్కులు కరకట్ట రోడ్డు మీదుగా ప్రాతూరు వచ్చి అక్కడనుంచి ప్రాతూరు- కుంచనపల్లి రోడ్డుమీదుగా హైవే ఎక్కి విజయవాడ, మంగళగిరి, గుంటూరు వైపు తరలివెడుతున్నాయి. రోడ్లు సైతం ఈ భారీ వాహనాల తాకిడికి దెబ్బతినిపోతున్నాయి. గత ఆరేడు మాసాలుగా జేపి వెంచర్స్ బదులుగా ముఖ్యమంత్రి బంధువే ఈ రీచ్‌లను స్వయంగా దోచుకుంటున్నారంటూ సమీప గ్రామ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.



● మున్నంగిలో ఇసుక అక్రమ తవ్వకాల కోసం నదిలో దారులు

● నిబంధనలకు పాతరేసి... అడ్డగోలుగా తవ్వేస్తూ...

- అనుమతులతో పనిలేకుండా ఇష్టమొచ్చిన చోట తవ్వకాలు
- మైనింగ్ శాఖకు అడ్డుకునే ధైర్యమేదీ!
- భూగర్భ జలాలు అడుగంటుతున్నా కన్నెత్తి చూడదు
- నెలవారీ మామూళ్లు కడితే చాలు.. పోలీస్, సెబ్‌కు పట్టదు
- అక్రమ తవ్వకాలను అడ్డుకుంటామంటే కత్తులు, రాడ్‌లతో దాడులు
- ట్రాక్టర్‌లతో తొక్కించి చంపేందుకూ సిద్ధం
- మొన్న అమరావతి, నిన్న మున్నంగి ఘటనలే నిదర్శనం

తెనాలి, మార్చి 30, (ఆంధ్రజ్యోతి): గతంలో జేపీ సంస్థ, నిన్నటి వరకు జీసీకేసీ సంస్థ పేరుచెప్పి ఇసుక తవ్వేశారు. గత 6 నెలల నుంచి మరింత బరితెగించి అక్రమ తవ్వకాలకు తెగబడుతున్నారు. గుంటూరు, బాపట్ల జిల్లాల పరిధిలో ప్రకాశం బ్యారేజికి దిగువున గుండిమెడ, పెదకొండూరు, మున్నంగి, వల్లభాపురం, బొమ్ముvానిపాలెం, గాజుల్లంక, జువ్వలపాలెం రీచ్‌లలో తవ్వకాలకు అనుమతులున్నాయని చెబుతున్నారు. అటు పల్నాడు, గుంటూరు జిల్లాల్లో బ్యారేజికి ఎగువున కె.వి.పాలెం, కొత్తపల్లి, చామర్రు, మల్లాది, వైకుంఠపురం రీచ్‌లలో అనుమతులున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే వారికి ఆయా రీచ్‌లలో అనుమతిచ్చిన ప్రదేశం ఎక్కడ? తవ్వుతున్నది ఎక్కడనేది మాత్రం పర్యవేక్షించే వారే లేరు. ఇక్కడ తవ్వేది తక్కువైతే, అక్రమ తవ్వకాలు మాత్రం అసలు రీచ్‌లకు దగ్గర్లో మరో చోట తవ్వేస్తున్నా పట్టించుకునే వారేలేరు. ఈ మధ్య జగనన్న కాలనీల పేరుతో ఇసుక రీచ్‌లకు అనుమతులు తీసుకుని ఇసుకను తరలిస్తున్నారు. కొల్లూరు మండలం జువ్వలపాలెం రీచ్‌కు అనుమతిస్తే అక్కడ అసలు తవ్వకాలే జరపలేదు. దీనికి దూరంగా జువ్వలపాలెం-ఓలేరు మధ్య నదిలో తవ్వేస్తున్నారు. అయితే కలెక్టర్‌లు ఇక్కడ పరిశీలిస్తే మాత్రం అంతా బాగుందన్నట్టే కనిపించే పరిస్థితి. పెనుమూడి దగ్గర నీటిలో ఇసుక తవ్వకాలకు అనుమతిలేదు. కానీ ఇక్కడా తవ్వకాలు ఆగలేదు. కొల్లూరు మండలం గాజుల్లంకలో మరో రీచ్‌కు అనుమతి ఉందని అధికారులు చెబుతుంటే చిలుమూరు, పెసర్లంక-పెదలంక మధ్య పట్టా భూముల్లోనూ అడ్డు లేకుండా తవ్వేస్తున్నారు. గతంలో ఈ లంకల్లో రైతులు అక్రమ తవ్వకాలను అడ్డుకుంటే, వారి ఇళ్లకు అర్ధరాత్రులు పోలీసులను వెంటబెట్టుకుని మరీ వెళ్లి అక్రమార్కులు బెదిరించిన పరిస్థితి. అన్నవరం, బొమ్మువానిపాలెం, కొల్లిపర, అత్తలూరివారిపాలెం, పెదకొండూరు, ప్రాతూరు ప్రాంతాల్లోనూ అక్రమతవ్వకాలు యథేచ్ఛగా సాగిపోతూనే ఉన్నాయి.

అడ్డుకుంటే తొక్కేస్తారా..?

గతంలో అమరావతి మండలంలో ఇసుక అక్రమ తవ్వకాల ఫొటోలు తీసేందుకు వెళితే విలేకరిపై విచక్షణా రహితంగా దాడిచేసి, చంపబోయారు. తాజాగా మున్నంగిలోనూ స్థానికులు అక్రమ తవ్వకాల కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయని గగ్గోలు పెడుతూ అడ్డుకునేందుకు సిద్ధమయ్యారు. అయితే ఇసుక అక్రమ తవ్వకందారులు, వారి అనుచరులు ట్రాక్టర్లతో జనాన్ని తొక్కించేందుకు కొద్దిసేపు భయానక వికృత క్రీడకే తెరతీశారు. గుద్దించి పడిపోయిన వ్యక్తిపైకి టైరు ఎక్కించి కదలకుండా చేసి, అతను వేడుకుంటున్నా వదలకుండా మిగిలినవారు కాళ్లతో విచక్షణారహితంగా తన్నారు. మరికొందరు నిలబడి ఉన్న జనంపైకి కత్తు లు, రాడ్‌లు తీసుకుని దాడికి తెగబడ్డారు. కరకట్టపై వెళ్లే వాహనదారులు కూడా భయపడిపోయి పరుగులుపెట్టాల్సిన పరిస్థితి. అయితే ఈ ఘటనపై వేగంగానే స్పందించిన పోలీసులు దాడిచేసిన వారినీ, దెబ్బలు తిన్నవారిలో కొందరిని స్టేషన్‌కు తీసుకొచ్చినా, చివరకు పై వత్తిడులతో కేసు కట్టకుండా రాజీ ప్రయత్నాలు చేశారనే విమర్శ వచ్చింది. అయితే దాడి వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో తర్వాత తప్పనిసరై కేసు నమోదు చేశారని బాధితు లు చెబుతున్నారు. ఇంతటి దారుణ పరిస్థితులు కనిపిస్తు న్నా అధికార యంత్రాంగం మాత్రం ఎన్నికల వేళ ఇంకా మీనమేషాలు లెక్కించటం విమర్శలకు కారణమవుతోంది.

నిబంధనలన్నీ ఎక్స్‌కవేటర్ చక్రాల కింద కప్పెట్టేసి...

ఇసుక రీచ్‌లలో ఇసుక తవ్వాలంటే దానికి వాల్టా చట్టం నుంచి గ్రీన్‌ట్రిబ్యునల్ నిబంధనల వంటివి సవాలక్ష ఉన్నా యి. కానీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో ఇవే మీ వర్తించవు. ప్రస్తుతం ఏ రీచ్‌లో ఇసుక తవ్వాలన్నా కేవలం కూలీల సాయంతోనే తవ్వాలి. భారీ ఎక్స్‌కవేటర్లు ఉపయోగించకూడదు. నదిలోకి ట్రాక్టర్‌ల వంటివి మినహా కనీసం ఆరు చక్రాల లారీలను కూడా దింపటానికి వీలులేదు. సాయంత్రం 6 తర్వాత తవ్వకాలు ఆపాల్సిందే. మైనింగ్ శాఖ అనుమతిచ్చిన ప్రదేశంలో మాత్ర మే అనుమతించిన పరిమాణం,లోతుకు మించి తవ్వటానికి వీలులేదు. కనీసం నీటి చె మ్మ కూడా బయటకు కనిపించేలా తవ్వటానికి వీలులేదు. నదీ ప్రవాహం ఉన్న పాయల వెంట అసలు తవ్వకాలు జరపటానికి వీలులేదు. నీటి అ డుగున తవ్వకాలు జరపాల్సివస్తే, ఎంత పరిమాణం? ఎక్కడెక్కడ తియ్యవచ్చనేది అధికారులు నిర్ణయించిన ప్రకారమే డ్రెడ్జర్‌లతో తియ్యాలి. ఇవి కాకుండా మరిన్ని కఠిన నిబంధనలు చాలానే ఉన్నా, ఇవేమీ ఇక్కడ పనిచెయ్యవు. ఈ ప్రాంతాల్లో ఏ రీచ్‌కూ పర్యావరణ, ఇతర అనుమతులు లేవని, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నాయంటూ జాతీయ హరిత ట్రిబ్యునల్ ఇసుక రీచ్‌లన్నిటినీ ఆపేయాలని ఎప్పుడో ఆదేశాలిచ్చింది. నిబంధనల మేరకు తవ్వకాలు జరిగిందీ, లేనిదీ నివేదిక ఇవ్వాలని ఆదేశిస్తే, కలెక్టర్‌లే అవేమీ లేవని నివేదికలివ్వటం ఇక్కడ దందా వెనుకున్న అక్రమార్కుల అండకు నిదర్శనం. ఒక్క రీచ్‌లో కూడా కూలీలతో తవ్వకాలు జరుపుతున్నదిలేదు. ఏకంగా భారీ ఎక్స్‌కవేటర్లు తీసుకొచ్చి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. పైగా ఇసుక మేటవేసిన మందాన్ని బట్టి అడుగు నుంచి మూడు అడుగుల లోతులో తవ్వాల్సిఉన్నా, మీటర్ల కొద్దీ తవ్వేస్తున్నారు.

సమాచారం కావాలంటే అర్జీ పెట్టాల్సిందే..

గుంటూరు జిల్లాలో ఏ రీచ్‌ల కు అనుమతులున్నాయో! ఎక్కడెక్కడ తవ్వకాలు జరపొచ్చనే సమాచారం కావాలన్నా, మరే ఇతర వివరాలు కావాలన్నా ఒక అర్జీ పెట్టాల్సిందే. సామాన్యుడికైనా, మరెవరికైనా ఇదే నిబంధన. మున్నంగి రీచ్‌లో అక్రమ తవ్వకాలు ఏమీ లేవు. ఒకవేళ అనుమతించిన ప్రదేశంలో కాకుండా అక్రమంగా మరెక్కడైనా తవ్వుతున్నారనే అనుమానం ఉంటే వారికిచ్చిన అనుమతి పత్రంలో అక్షాంశ, రేఖాంశాలుంటాయి. జీపీఆర్ఎస్ ద్వారా మీరే పరిశీలించుకోవచ్చు. నిబంధనల అతిక్రమణ జరగటంలేదు. యంత్రాల విషయం పరిశీలిస్తాం.

- జిల్లా మైనింగ్ అధికారి చంద్రశేఖర్

పోలీస్, సెబ్ శాఖలు

కొందరు అధికారులు వత్తిడులకు రీచ్‌లలో ఏం జరిగినా వారికి సంబంధం లేదన్నట్టు ఉంటారు. మరికొందరు రెండు, మూడు రీచ్‌లలో మాత్రమే చాలావరకు కట్టడి చేస్తున్నాం అనిపిస్తున్నారు. ఇంకొందరయితే అవేమీ మాకు సంబంధం లేదన్నట్టు లారీ యజమానుల దగ్గర నుంచి నెలవారీ మామూళ్లకు వాట్సప్ గ్రూపులు పెట్టి మరీ వసూళ్లు చేసేస్తున్నారనేది లారీ యజమానుల ఆరోపణ.

భూగర్భ 'ఘనుల' శాఖ

ఇసుక తవ్వకాలకు అనుమతులివ్వాలి కాబట్టి మారు మాట్లాడకుండా ఇచ్చేస్తారు. వారు అనుమతించిన చోట తవ్వుతున్నారా? లేక అక్రమంగా ఇతర ప్రదేశాల్లో తవ్వేస్తున్నారా అనేది చూసేందుకు రీచ్‌లలో అడుగు పెట్టటానికి కూడా సాహసించరు.

భూగర్భ జలవనరుల శాఖ

నదుల్లో ఇసుక తవ్వకాలకు నేతలు, వారి అనుచరులు ఎక్కడ అడిగితే అక్కడ 'నో అబ్జెక్షన్' అంటూ అనుమతులు ఇవ్వాల్సిందే. నీరు బయటపడేలా వాల్టా నిబంధనలకు విరుద్ధంగా భారీ లోతుల్లో తవ్వేస్తున్నా, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని నదీ తీరవాసులు గొంతెత్తి అరుస్తున్నా వీరికేమీ వినిపించవు.

పర్యావరణం, నీటిపారుదల శాఖ


ఈ శాఖలకు ఇక్కడ చోటేలేదు. వారిని కాగితాలపై సంతకాల వరకే పరిమితం చేశారు. జిల్లాల కలెక్టర్‌లైతే రీచ్‌లను స్వయంగా పరిశీలించి, అక్రమ తవ్వకాలు పక్కనే కనిపిస్తున్నా అటువైపు కన్నెత్తికూడా చూడకుండా అంతా బ్రహ్మాండంగా ఉందని, ఎక్కడా అక్రమ తవ్వకాలే జరగటంలేదని ఏకంగా జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కే నివేదికలిచ్చేస్తారు.

● ఇదీ గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాల దందా వెనుక జరుగుతున్న లోగుట్టు. కింది స్థాయి అధికారి నుంచి జిల్లాల పాలనాధికారుల వరకు రీచ్‌లలో జరుగుతున్నది అక్రమమే అని తెలిసినా, మారు మాట్లాడే సాహసం కూడా చేయకుండా నేతలకు జీ హుజూర్ అంటూ అధికారులే చేతులెత్తేస్తుండటం విచిత్రమే.

కొన్నిచోట్లయితే పది నుంచి 18 అడుగుల లోతులో గుంతలుపెట్టి మరీ ఇసుక తవ్వేస్తున్నారు. ఇసుక పొర కింద నీరు బయటకు కనిపించకూడదు... కానీ నీరు బయటకు వచ్చినా దానిలోనూ పదడుగుల వరకు ఇసుక తవ్వేస్తున్నారు. నీరంతా ఆవిరై, భూగర్భ జలా లు అడుగంటిపోవటానికి కారణమవుతోంది.

అధికారులకు చిత్తశుద్ధి కరువు..

అధికారులు నిజంగా చిత్తశుద్ధితో తవ్వకాలను పర్యవేక్షిస్తున్నారనుకుంటే, ఒక్క రీచ్‌లో కూడా పొక్లెయిన్ లేకుండా మొత్తాన్నీ సీజ్ చేసేవారే. కానీ ఎక్కడా ఇటువంటిది జరగటం లేదు. ఒక్కో రీచ్‌లో కనీసం మూడు నుంచి ఆరుకుపైగా భారీ పొక్లెయిన్లు ఇసుక తవ్వేస్తున్నాయి. అధికారిక, అనధికార రీచ్‌లన్నీ లెక్కేస్తే బ్యారేజి ఎగువన, దిగువన మొత్తం 100కుపైగా భారీ పొక్లెయిన్‌లు కృష్ణానదిని తోడేస్తున్నాయి. కనీసం వీటిని కట్టడి చేసినా కొంతైనా అక్రమాలు తగ్గే అవకాశం ఉంటుంది. తాజాగా మరోమారు జిల్లాల కలెక్టర్‌లు రీచ్‌ల బాట పట్టనున్నారనేది సమాచారం. అప్పటికైనా గత పరిశీలనల్లా కాకుండా అక్రమ తవ్వకాలపై ఆరా తీస్తే తీరవాసుల గొంతెండే పరిస్థితికి ఉపశమనం లభిస్తుంది.



● తవ్వకాలతో ఏర్పడిన భారీ గుంతలు

పరిమితికి మించి లారీలో ఇసుక

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.26(ఆదివారం)
సహోర్ (ఉదయం) 4.46 (సోమవారం)

చంద్రబాబు ప్రజాగళం నేడే

- బాపట్ల పట్టణంలో రోడ్‌షో నిర్వహణ
- అంబేడ్కర్ కూడలిలో బహిరంగ సభ
- తరలిరానున్న టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు
- రాత్రికి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస

బాపట్ల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం బాపట్లలో ప్రజాగళం సభ నిర్వహిం చను న్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లను టీడీపీ నేతలు ఇప్పటికే పూర్తి చేశారు. శ్రేణులను సమాయత్తం చేసే కార్యక్ర మంలో భాగంగా బాపట్లలోని టీడీపీ కార్యాల యంలో కూటమి నేతలు శుక్రవారం సమావేశం నిర్వహించిన సంగతి తెలిసిందే. ఎన్నికల షెడ్యూ ల్ విడుదలైన తర్వాత ప్రచారం కోసం తొలిసారి చంద్రబాబు జిల్లాకు రానుండడంతో అధినేతకు ఘన స్వాగతం పలికేందుకు తెలుగుదేశం నేతలు సిద్ధమయ్యారు. జిల్లా కేంద్రం కావడం, అందునా బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గం కూడా కావడం తో పరిధిలోని అన్ని నియోజకవర్గాల నుంచి టీడీపీ శ్రేణులు తరలివచ్చే అవకాశం ఉంది. దీనికి తోడు బీజేపీ, జనసేన పొత్తులో ఉన్నందున ఆ పార్టీల మద్దతుదారులు కూడా భారీసంఖ్యలో హాజరుకానున్నారు. అంతేకాకుండా పాలకపార్టీ వైఖరిపై విసిగివున్న సామాన్య ప్రజలుసైతం స్వచ్ఛందంగా చంద్రబాబుకు బ్రహ్మారథం పడతారనే ధీమాను టీడీపీశ్రేణులు వ్యక్తం చేస్తున్నాయి. చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి పెద్ద ఎత్తున చేరికలు కూడా ఉండనున్నాయి. అప్పికట్ల సర్పంచ్‌తోపాటు మరికొం తమంది వైసీపీ నాయకులు అధినేత సమక్షం లో టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారని తెలుస్తోంది.

టీడీపీలో జోష్..

ప్రజాగళం సభ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు బాపట్లకు రానుండడంతో టీడీపీలో జోష్ కనబడుతోంది. పొత్తు పొడిచాక జరుగుతున్న తొలి సభ కావడంతో కూటమి ఉమ్మడి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా చంద్రబాబు ప్రచారం చేపట్టనున్నారు. వైసీపీ దుర్మార్గ పాలన అంతమొందించడమే లక్ష్యంగా అధినేత చేపట్టిన ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ నేతలు ప్రజలకు పిలుపిచ్చారు. ఈ సభ ద్వారా ప్రజలను మరింత చైతన్యపరచడంతో పాటు పాలకపార్టీ అరాచకాలను జనానికి వివరించనున్నారని ప్రతిపక్ష పార్టీ నేతలు చెబుతున్నారు.

చంద్రబాబు పర్యటన సాగేదిలా...

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో ఆదివారం సాయంత్రం చంద్రబాబు దిగనున్నారు. అక్కడ నుంచి 216 జాతీయ రహదారి మీదుగా రోడ్‌షో చేపట్టనున్నారు. కుక్కలవారిపాలెం, దరివాదకొత్తపాలెం మీదుగా పట్టణంలోని జమ్ములపాలెం ఆర్‌వోబీ వద్దనున్న అంబేడ్కర్‌కూడలి వద్దకు చేరుకోనున్నారు. సాయంత్రం 5:30కు ప్రజాగళం బహిరంగ సభ లో ప్రజలనుద్దేశించి చంద్రబాబు మాట్లాడ నున్నారు. రాత్రికి ఇంజనీరింగ్ కళాశాలలోనే బస చేయనున్నారు.

లోటుపాట్లపై సమీక్ష!


టీడీపీ అధినేత చంద్రబాబు రాత్రికి బాపట్లలోనే బస చేయనున్న దృష్ట్యా సోమవారం ఉదయాన్నే ఆయా నియోజకవర్గాల అభ్యర్థులతో పార్టీ పరిస్థితిపై సమీక్షించనున్నారని సమాచారం. మున్ముందు చేపట్టాల్సిన కార్యక్రమాలతో పాటు కూటమి నేతలతో సమన్వయంపై నేతలకు దిశానిర్దేశం చేయనున్నారు. వైసీపీ వేధింపులతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘనలు, ఓట్ల అక్రమాల వంటివన్నీ సమీక్షలో చర్చకు రానున్నాయని తెలుస్తోంది.



హెలిప్యాడ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కృష్ణప్రసాద్, వేగేశన

వలంటీర్ల సేవలు.. ఇక చాలు

- సంక్షేమ పథకాలకు దూరంగా ఉంచాలని ఆదేశాలు
- పెన్షన్లు కూడా సెక్రటరీలు పంచాల్సిందే
- ఫోన్లు స్వాధీనం చేసుకోవాలని ఎన్నికల కమిషన్ హుకుం
- వలంటీర్లు సరే... మరి ఎండీయూల సంగతో..?



గుంటూరు/గుంటూరు సిటీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా తాను నియమించిన వారి ద్వారా ఎన్నికల్లో లబ్ధి పొందాలని భావించిన వైసీపీకి కేంద్ర ఎన్నికల సంఘం ఝలక్‌లు ఇస్తోంది. తాజాగా వలంటీర్ల సేవలు ఇక చాలు అని చెప్పింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పెన్షన్లు పంపిణీతో పాటు, ఇతర సంక్షేమ పథకాలన్నీ పంచాయతీ సెక్రటరీ, ప్రభుత్వ ఉద్యోగుల నేతృత్వంలో మాత్రమే జరగాలని ఆదేశాల్లో పేర్కొన్నారు. ఎన్నికల వేళ ఓటర్లను ప్రభావితం చేసే విధంగా వలంటీర్లు పనిచేస్తున్నారని అఖిల భారత పంచాయతీ పరిషత్, సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ చేసిన విజ్ఞప్తి మేరకు కేంద్ర ఎన్నికల కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆదేశాల్లో పేర్కొన్నారు.

వలంటీర్ల పనితీరు వివాదాస్పదం..

ఎన్నికల వేళ వలంటీర్ల పనితీరు పూర్తి వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం తీసుకుంటూ వైసీపీ నేతలకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు తరచూ వస్తున్నాయి. కొన్నిచోట్ల వైసీపీ నేతల ప్రచారంలో కూడా పాల్గొన్నారు. దీనిపై ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామిక సంస్థలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయటంతో చాలా చోట్ల వలంటీర్లను విధులనుంచి తొలగించారు.

మిగిలింది మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్‌ల ఆపరేటర్లే..

పౌరసరఫరాల చట్టానికి విరుద్ధంగా మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్‌ల ఆపరేటర్లను వైసీపీ ప్రభుత్వం నియమించింది. ఇప్పుడు వీరి ద్వారానే ఓటర్లకు గడప వద్దకే నగదు పంపిణీ చేయాలని కొంతమంది నేతలు భావిస్తున్నారు. గుంటూరు జిల్లాలో 972 రేషన్ దుకాణాలుండగా వీటి పరిధిలో 352 మంది ఎండీయూలున్నారు. అలానే బాపట్లలో 1123 షాపులకు గాను 294, పల్నాడు జిల్లాలో 1392 దుకాణాలకు 385 మంది ఎండీయులున్నారు. వాస్తవానికి రేషన్ సరుకులను డోర్ డెలివరీ చేసే లక్ష్యంతో వీరిని నియమించారు. ఓటర్లకు నగదు పంపిణీ చేసేందుకు వైసీపీ నేతలు ఎండీయూలను వినియోగించే ప్రయత్నాలు మొదలుపెట్టారు. జిల్లాలోని ఒక అసెంబ్లీ నియోజకవర్గంలో ఇప్పటికే ఎండీయూలను సంబంధిత వైసీపీ అభ్యర్థి పిలిపించుకొని మాట్లాడినట్లు సమాచారం. ముఖ్యంగా ఎన్నికలు జరిగే మే నెలలో ఇంటింటికి వెళ్లి రేషన్ సరుకులతో పాటు ఓటర్లకు నగదు పంపిణీ చేయాలని కోరినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో వలంటీర్ల వలే ఎండీయూల సేవలను కూడా ఈ రెండునెలలు నిలిపేయాలని ప్రతిపక్ష పార్టీల నాయకులు కోరుతున్నారు. దీనిపై తాము ఈసీకి కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు.

మంచి పరిణామం : జాస్తి

పెన్షన్లు పంపిణీలో వలంటీర్లను పక్కనపెడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీచెయ్యడం మంచి పరిణామం. సంక్షేమపథకాల అమలులో వలంటీర్ల పాత్ర చాలా వివాదాస్పదంగా మారటంతో వారిపై అఖిల భారత పంచాయతీ పరిషత్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చెయ్యడం జరిగింది. జిల్లా అధికారులు కూడా కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలను అమలు చేయాలి.

సాగర్ చెంత.. నీటికి చింత



తాగునీటికోసం మండుటెండలో మహిళల అవస్థలు

మాచర్ల టౌన్, మార్చి 30: మాచర్ల మండలం నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ సమీపంలోని లంకమోడులో తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. 15 రోజులుగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రంజాన్‌మాసం కావడంతో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు తాగునీటి కష్టాలు పరీక్ష పెడుతున్నాయి. అరకొరగా వచ్చే కొద్దిపాటి నీటిని బేసిన్ అడ్డుగా పెట్టి మహిళలు బిందెలలో నింపడం కాలనీలో తీవ్ర నీటి ఎద్దడికి అద్దం పడుతోంది. కులాయిల్లో అరకొరగా వచ్చే ఆనీటిలోనూ మట్టి, మురుగు, గుడ్డ ముక్కలు వస్తున్నా ఆ నీటిని తాగుతున్నామని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలకృత్యాలకు సైతం క్యాన్‌నీరు కొనుక్కోవాల్సి వస్తోందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండుటెండలో ఉపవాస దీక్షలు చేపట్టిన ముస్లింలకు తాగునీటి సమస్య సవాలుగా మారింది. సమస్యపై ఎన్నిమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేదంటూ మహిళలు వాపోతున్నారు.

యువత భవితను నిర్దేశించే ఎన్నికలివి

- ఆచితూచి నిర్ణయం తీసుకోవాలి
- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు, పాల్గొన్న ఎంపీ లావు, మాజీ ఎమ్మెల్యే యరపతినేని తదితరులు

చిలకలూరిపేట అర్బన్, మార్చి 30: ప్రస్తుతం జరగబోతున్న ఎన్నికలే రాష్ట్ర యువత భవితను నిర్దేశించ బోతున్నాయని, ప్రజలంతా ఆచితూచి నిర్ణయం తీసుకోవాలని మాజీ మంత్రి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని ప్రత్తిపాటి గార్డెన్స్‌లో ప్రైవేట్ ఉపాధ్యాయులు, సిబ్బందితో జరిగిన సమావేశంలో ప్రత్తిపాటితో పాటు నరసరావుపేట పార్లమెంట్, లావు శ్రీకృష్ణదేవరాయలు, యరపతినేని శ్రీనివాసరావులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడుతూ అసమర్ధ పాలనలో యువత చదువుకున్న చదువులు నిరర్ధకంగా మారాయని, ఇందుకు జగన్ ఏలుబడే ఉదాహరణ అన్నారు. వైసీపీ ప్రభుత్వ తీరుపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, సిబ్బంది పూర్తి అసంతృప్తిగా ఉన్నాయన్నారు. రాజధాని నిర్మాణం కావాలన్నా, పోలవరం పూర్తి కావాలన్నా, ఏటా డీఎస్సీ క్రమంతప్పని జాబ్ నోటిఫికేషన్‌లతో యువతకు మంచి భవిష్యత్ కావాలంటే తెలుగుదేశం కూటమితోనే సాధ్యమన్నారు. చిలకలూరిపేటను అన్ని విధాలా అభివృద్ధి చేసిన తనతో పాటు ఉన్నత విద్యాసంస్థలు నిర్వహిస్తున్న లావు శ్రీకృష్ణ దేవరాయలను బలపరచాలని ప్రత్తిపాటి కోరారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ చిలకలూరిపేట అభివృద్ధి చేసింది ఎవరు?, నరసరావుపేట ఎంపీగా నేనే చేశాను. ఎవరైతే ప్రజలకు అందుబాటులో ఉంటారో, అభివృద్ధికి పాటుపడతారో ఆలోచించి ఓటు వేయాలన్నారు. అనంతరం యరపతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ జగన్ ఐదు సంవత్సరాల పాలనలో రాష్ట్రం ఎంతో నష్టపోయిందని, విద్యావ్యవస్థను పూర్తిగా నాశనం చేశారని, రాష్ట్ర ప్రయోజనాలు వదిలేసి, సొంత ప్రయోజనాలే అజెండాగా పాలన సాగించారని ధ్వజమెత్తారు. అభివృద్ధే ధ్యేయంగా పనిచేసే పార్లమెంట్ అభ్యర్థి లావుకు, శాసనసభ అభ్యర్థి ప్రత్తిపాటికి మద్దతుగా నిలవాలన్నారు.

మూడు రాజధానులంటూ ముంచారు

- 1565వ రోజుకు ఆందోళనలు



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరాలలో ఆందోళన చేస్తున్న మహిళలు

తుళ్ళూరు, మార్చి 30: రాష్ట్ర రాజధాని అమరావతికి ప్రభుత్వం భూములు అడిగితే 33వేల ఎకరాలు ఇచ్చామని, అభివృద్ధి కొనసాగుతున్న తరుణంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు రాజధానులని రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురి చేసిందన్నారు. మూడు రాజధానులు వద్దు మొదట భారతదేశ పటంలో పేర్కొన్న రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతిని అభివృద్ధి చేయాలన్నారు. అమరావతి రాష్ట్ర సంపద అని తెలిసినా సీఎం జగన్‌రెడ్డి మూడు ముక్కలాటతో అమరావతిని నాశనం చేయటం ప్రారంభించారని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1565వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి, వారి వారి ఇళ్ల వద్ద నుంచి పులువురు రైతులు నిరసనలు, దీక్షలు చేశారు. సొంత ప్రయోజనాల కోసం మూడు రాజధానులు అని సీఎం జగన్‌రెడ్డి భూములిచ్చిన రైతులను నట్టేట ముంచే క్యాక్రమం తలపెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.

ఉద్యోగం అక్కడ.. విధులు ఇక్కడ

- నెల్లూరు జిల్లా ఉద్యోగి రేపల్లె తహసీల్దారు కార్యాలయంలో విధులు
- ఇక్కడ చక్రం తిప్పుతున్నవైనం



రేపల్లె తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏ షేక్ షరీఫ్



తహసీల్దారు రవీంద్రబాబు డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్న నెల్లూరు జిల్లా ఇంజిమూర్ మండలం ఓటుకూరు గ్రామం వీఆర్‌ఏ షరీఫ్

రేపల్లె, మార్చి 30: ప్రభుత్వ నిబంధనల ప్రకారం విధులు నిర్వహించాల్సిన ఓ ప్రభుత్వ ఉద్యోగి అందుకు విరుద్ధంగా తనపై అధికారి ఎక్కడికి బదిలీ అయితే అక్కడకు వెళ్ళి అనధికారికంగా ఆయనకు డ్రైవర్‌గా వ్యవహరిస్తూ అధికారిక వ్యవహారలన్నింటినీ చక్కబెడుతూ జేబులు నింపుకుంటున్నాడు. నెల్లూరు జిల్లా ఇంజిమూరు తహసీల్దారుగా విధులు నిర్వహించిన టి.రవీంద్రబాబు ఎన్నికల దృష్ట్యా జనవరి నెలలో రేపల్లె తహసీల్దారుగా బదిలీపై వచ్చారు. నెల్లూరు జిల్లా ఇంజిమూరు మండలం ఉంగుటూరు గ్రామం వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్న షేక్ షరీఫ్ ఆయన వెంటే ఉండేవారు. తహసీల్దారు వెంటే ఇక్కడకు వచ్చి వ్యవహారాలన్నీ చక్కబెడుతూ తాను జేబులు నింపుకుంటున్నాడు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.

ఆరుగురు వేమెన్‌ల లైసెన్స్‌ల సస్పెన్షన్

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతలతో మిర్చియార్డులో నిబంధనలకు విరుద్ధంగా ఎన్నికల ప్రచారం చేయించిన వేమెన్ అసోసియేషన్ నాయకులను మార్కెటింగ్‌శాఖ జేడీ కాకుమాను శ్రీనివాసరావు సస్పెన్షన్ చేశారు. ఈ నెల 22వ తేదీన మిర్చియార్డులోని వేమెన్ అసోసియేషన్ కార్యాలయంలో వైసీపీ నేతలతో అసోసియేషన్ నాయకులు సమావేశం ఏర్పాటుచేయించి వైసీపీకి మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించారు. ఈ సమావేశంలో క్రియాశీలకంగా వ్యవహరించిన వేమెన్‌లు గోరంట్ల రాజగోపాల్, కొండా శ్రీనివాసరెడ్డి, లక్కిరెడ్డి మల్లికార్జునరెడ్డి, ప్రత్తిపాటి కృష్ణప్రసాద్, కొటారి శ్రీహరిరావు, చల్లా కోటిరెడ్డిలను సస్పెన్షన్ చేశారు.

మహిళలు మనోధైర్యంతో ముందుకు వెళ్లాలి: పెమ్మసాని



విద్యార్థినులతో కలిసి అభివాదం చేస్తున్న పెమ్మసాని

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కిరణ్ మజుందర్ షా, ఇంద్రా నూయి వలె మహిళలు మనోధైర్యంతో ముందుకు సాగాలని గుంటూరు పార్లమెంట్ టీడీపీ అభ్య ర్థి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. పెద పలకలూరులోని విజ్ఞాన్ నిరుల ఇన్‌స్టిట్యూ ట్ ఆఫ్ టెక్నాలజీ సైన్సెస్ ఫర్ విమెన్ కాలేజీలో శనివారం జరిగిన పరిచయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ లు భవిష్యత్తులో ఏ బాధ్యతలు చేపట్టినా ప్రతి అంశంలోను నెంబర్ వన్‌గా ఎదగా లని సూచించారు. తాను ఈరోజు ఇంత హుందాగా ఉండడానికి తన తల్లి, భార్య ప్రధాన కారణమని తెలిపారు. ఓటు హక్కు తొలిసారి ఉపయోగించుకునే ముందు మహిళలు ఒక్కసారి ఆలోచించి అభివృద్ధికి ఉపయోగపడే నాయకులను ఎన్నుకోవా లని ఆయన ఈ సందర్భంగా కోరారు.ప్రత్తిపాడు టీడీపీ అభ్యర్థి బూర్ల రామాంజనే యులు మాట్లాడుతూ మహిళలకు ఆస్తి హక్కును ఎన్టీఆర్ అందిస్తే చంద్రబాబు నాయుడు మహిళా సాధికారికతను అందించారని వివరించారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి కొర్రపాటి నాగేశ్వరరావు, సంస్థ డైరెక్టర్ కూర్మనాథం తదితరులు పాల్గొన్నారు. కాగా సెయింట్ మ్యాథ్యూస్ లూథరన్ చర్చ్‌లో శనివారం జరిగిన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని పెమ్మసాని ప్రారంభించి పాల్గొన్నారు. కార్యక్రమంలో టీడీపీ గుంటూరు తూర్పు, పశ్చిమ అభ్యర్థులు, పిడుగురాళ్ల మాధవి, మహమ్మద్ నసీర్, మేని తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి జంగా.. వైసీపీకి బిగ్ షాక్

- నేడు చేరనున్న ఎమ్మెల్సీ

నరసరావుపేట, మార్చి 30: జిల్లాలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయి. వైసీపీకి బిగ్‌షాక్ తగలనుంది. ఆ పార్టీని వీడి సీనియర్‌లు టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి తెలుగుదేశం తీర్థం పుచ్చుకోనున్నారు. అయనతోపాటు గురజాల నియోజకవర్గంలోని పలువురు నేతలు వైసీపీని వీడి జంగాతో టీడీపీలో చేరనున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఆదివారం జరగనున్న పర్యటనలో జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు సమక్షంలో ఆయన పార్టీ చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఇప్పటికే ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలసి ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చంద్రబాబుతో కలసి పార్టీలో చేరే అంశంపై చర్చలు జరిపారు. జంగా చేరికకు చంద్రబాబు అంగీకరించారు. మాజీ ఎమ్మెల్యే, గురజాల టీడీపీ అభ్యర్థి యరపతినేనితో కూడా చర్చలు జరిపారు. గురజాల నియోజకవర్గంలో ప్రత్యర్థులుగా ఉన్న జంగా, యరపతినేని ఇరువురు ఒకే పార్టీలో కలసి పనిచేయనున్నారు. ఈమేరకు చర్చలు సఫలమయ్యాయి. యరపతినేని విజయం కోసం జంగా కృషి చేయనున్నారు.

ఎన్నికల కోడ్ అమలులో వీడని నిర్లక్ష్యం



గాజుల్లంక సచివాలయం వద్ద నిర్మించిన దిమ్మెపై కనిపిస్తున్న జగన్ చిత్రం



గాజుల్లంకలో ఏర్పాటుచేసిన బెంచీలపై రాజకీయ నాయకుల పేర్లు

కొల్లూరు, మార్చి 30: ఎన్నికల ప్రవర్తనా నియామవళి అమలులోకి వచ్చి రెండు వారాలు అయిన దానిని అమలు పరచడంలో అధికారులు నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉంది. మండలంలోని గాజుల్లంకలోని సచివాలయం ఎదురుగా నిర్మించిన సిమెంట్ దిమ్మెపై జగన్ చిత్రం కనిపిస్తోంది. పైగా గ్రామంలో పలు చోట్ల గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బెంచీలపై రాజకీయ నాయకులు పేర్లు కనిపించడం గమనార్హం. వాటికి కూడా ముసుగు వేయాల్సి ఉండగా సచివాలయ సిబ్బంది తమకేమీ సంబంధం లేనట్లుగా వదిలి వేశారు. ఎంపీడీవో లక్ష్మీకుమారి, తహసీల్దార్ పుల్లారావులు రెండుసార్లు సమావేశాలు ఏర్పాటుచేసి చెప్పినా గాజుల్లంక కార్యదర్శి చెవికి ఎక్కలేదేమో లేదా మారుమూల గ్రామం కదా ఎవరు చూస్తారులే అని నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారో వారికే తెలియాలి. ఇటీవల సర్పంచ్ ఇంటిపై ఉన్న హోర్డింగ్ తొలగించకపోవడంతో ఎంపీడీవో ఆ కార్యదర్శికి నోటీసులు ఇచ్చినా క్షేత్ర స్థాయిలో ఎన్నికల కోడ్ అమలు చేయడంలో నిర్లక్ష్యం వీడక పోవడం గమనార్హం.

పవన్ పర్యటనను విజయవంతం చేద్దాం

- జనసేన పీఏసీ చైర్మన్ మనోహర్



మార్కెట్ ప్రాంతంలో పవన్‌కల్యాణ్ పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్

తెనాలి రూరల్, మార్చి 30: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెనాలి పర్యటనను విజయవంతం చేద్దామని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం స్థానిక మార్కెట్ ప్రాంతంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 3న మునిసిపల్ మార్కెట్ ప్రాంగణంలో పురవేదిక వద్ద జరిగే పవన్‌కల్యాణ్ బహిరంగసభకు ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. పండ్ల వ్యాపారులతో ఆయన మాట్లాడుతూ ప్రజల కోసం చేసే ఈ పోరాటంతో వ్యాపారులు, చిరు వ్యాపారులు కూడా తమవంతుగా సహకరించాలన్నారు. అన్నాబత్తుని జయలక్ష్మి, గౌరీశంకర్, పలువురు టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఎన్నికల విధుల్లో అధికారుల నిర్లక్ష్యం



పార్కు చేసి ఉన్న కారు, చెట్టుకింద కూర్చుని ఉన్న ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

అమృతలూరు, మార్చి 30: ఎన్నికల సజావుగా జరిగేందుకు ఎన్నికల సంఘం కఠినచర్యలు తీసుకుంటున్నా కిందిస్థాయి సిబ్బందిలో నిర్లక్ష్యం వీడలేదు. అమృతలూరు, చుండూరు మండలాలకు సంబంధించి ఉమ్మడిగా ఫ్లయింగ్ స్క్వాడ్‌ను ఏర్పాటుచేశారు. ఈ స్క్వాడ్ గ్రామాల్లో తిరుగుతూ ఎన్నికల నియమావళి ఉల్లంఘన లేకుండా అక్రమంగా మద్యం, నగదు తరలింపులు అడ్డుకోవడం వంటి చర్యలు చేపట్టాలి. అలా చేయకుండా స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద కారు పార్కుచేసి సిబ్బంది చెట్టు కింద కూర్చున్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది గ్రామాల్లో విస్తృత పర్యటనలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

యథేచ్ఛగా వైసీపీ కోడ్ ఉల్లంఘనలు

- పట్టించుకోని అధికార యంత్రాంగం



పెదనందిపాడులో సుచరిత ఫొటో, వైసీపీ రంగులతో దర్శనమిస్తున్న శిలా ఫలకం



విగ్రహాల వద్ద దర్శన మిస్తున్న వైసీపీ రంగులు

ప్రత్తిపాడు, మార్చి 30: ప్రత్తిపాడు ఎన్నికల అధికారులు ఇంకా అధికర పార్టీకి కొమ్ముకాస్తూనే ఉన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నా వైసీపీ విషయంలో మాత్రం అధికార యంత్రాంగం మొత్తం చూసిచూడనట్టు పోతున్నారు. అందుకు ప్రత్యక్ష నిదర్శనమే పెదనందిపాడులో కనిపిస్తున్న ఈ దృశ్యాలు. పెదనందిపాడులో శిలా ఫలకాలపై వైసీపీ రంగులు ఇంకా దర్శన మిస్తున్నాయి. అంతే కాకుండా ఆ శిలాఫలకంలో మేకతోటి సుచరిత ఫొటోలు ఉన్నాయి. విగ్రహాలు ఉన్న చోట సైతం పార్టీ రంగులు లేకుండా చేయాల్సి ఉంది. కాని విగ్రహాలకు అయితే ముసుగులు వేశారు కాని రంగులు మాత్రం అలాగే ఉంచారు. ఈ విషయంలో ఎన్నికల అధికారులు మాత్రం చూసీ చూడనట్టే వ్యవహరిస్తున్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు పెంపు

తాడికొండ, మార్చి 30: రాష్ట్రంలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో పాఠశాలల్లో చేరుటకు నిర్వహించి ప్రవేశపరీక్ష దరఖాస్తు గడువు ఏప్రిల్ 5వ తేదీ వరకు పెంచటం జరిగిందని తాడికొండ ఏపీఆర్ఎస్ పాఠశాల ప్రిన్సిపాల్ పి.జోగారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ తరగతిలో అన్ని సీట్లకు, 6, 7, 8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి విద్యార్థులను నుంచి దరఖాస్తులు అహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హులైన వారికి ఏప్రిల్ 25వ తేదీన అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించ బడుతుందన్నారు.

కేంద్రీయ విద్యాలయంలో ప్రవేశాలకు నోటిఫికేషన్

తెనాలి అర్బన్, మార్చి 30: పట్టణంలోని జగ్గడిగుంటపాలెంలో ఏర్పాటు చేసిన కేంద్రీయ విద్యాలయంలో రానున్న విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు ప్రిన్సిపల్ శనివారం నోటిఫికేషన్ జారీ చేశారు. బాలవాటిక, 1వ తరగతి, 2 నుంచి 9వ తరగతి వరకు ఏర్పడే ఖాళీలను అనుసరించి దరఖాస్తులు కోరుతున్నామన్నారు. విద్యాలయంలో జనన ధ్రువీకరణ, ఆధార్ చూపి ప్రవేశ దరఖాస్తు పొందాలని తెలిపారు. 1వ తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని చెప్పారు. 11వ తరగతి ప్రవేశాలకు సీబీఎస్ఈ, స్టేట్ బోర్డు ఫలితాలు విడుదల అయిన 10 రోజుల్లో దరఖాస్తు పొందాలన్నారు. బాలవాటిక, 1వ తరగతి ప్రవేశ దరఖాస్తులను ఏప్రిల్ 15 లోగా అందించాలని, ఎంపికైన విద్యార్థుల జాబితాను ఏప్రిల్ 19న ప్రకటిస్తామన్నారు. వివరాలకు విద్యాలయంలో సంప్రదించాలన్నారు.



చుట్టుగుంటలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పెమ్మసాని, గల్లా మాధవి

మౌలిక సమస్యలను పరిష్కరిస్తా: గల్లా మాధవి

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): చుట్టుగుంటలో ఏళ్లకేళ్లుగా తిష్టవేసి ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గల్లా మాధవి హామీ ఇచ్చారు. 24వ డివిజన్ చుట్టుగుంట, ఏటీ అగ్రహారం, శాంతి నగర్, కలెక్టర్ బంగ్లా ప్రాంతాల్లో శనివారం గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి గల్లా మాధవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి టీడీపీ ప్రభుత్వం వస్తే తాము అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. పలువురు ప్రజలు రోడ్డు విస్తరణ పేరుతో ఉన్న రోడ్డును ధ్వంసం చేసారని, ఆ తరువాత సంవత్సరాలు గడుస్తున్నా పనులు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. రోడ్లు, డ్రైనేజి వ్యవస్థ పడకేసిందని, అధికారంలోకి వచ్చిన వెంటనే మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని హామీనిచ్చారు. అనేక చోట్ల అధికంగా కరెంట్ బిల్లులు వస్తున్నాయని, దీనిని కారణంగా చూపించి వచ్చే ప్రభుత్వ పథకాలను ఆపేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. టీడీపీ ప్రభుత్వంలో అంక్షలు లేని సంక్షేమాన్ని అమలు చేస్తామని ఇంకా 40రోజులు మాత్రమే మిగిలి ఉందని మాధవి ప్రజలకు భరోసానిచ్చారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజీవ్ ఆనంద్, ఆడక శ్రీను, చంద్ర, నిమ్మగడ్డ ప్రమీల, గౌస్, బాబు, మహ బూబున్నీసా, సాల్మాన్ రాజు, కోటేశ్వరావు, అనిల్, దాసరి జ్యోతి, ముత్తినేని రాజేష్, ఈరంటి వర ప్రసాద్ పాల్గొన్నారు.

1న బాలికల వసతి గృహ సముదాయానికి శంకుస్థాపన

● కేజేఎస్ఎస్ అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు

గుంటూరు(తూర్పు), మార్చి 30 : గుంటూరు జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బాలికల వసతి భవన సముదాయనికి ఏప్రిల్ 1వ తేదీ ఉదయం 8 గంటలకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కమ్మజన సేవ సమితి అధ్యక్షుడు సామినేని కోటేశ్వరరావు తెలిపారు. స్థానిక కుందులరోడ్డులోని బాలికల వసతి గృహంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వసతి గృహానికి, నూతన భవన సముదాయానికి వెన్నుదన్నుగా నిలిచిన ఎన్నారై దంపతులు నూతక్కి రామకృష్ణప్రసాదు, సీతామహాలక్ష్మి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరుపుతున్నట్టు చెప్పారు. అత్యాధునిక వసతులతో దాదాపు 2 వేల మంది బాలికలకు వసతి కల్పించేందుకు రూ.50 కోట్లతో ఈ నిర్మాణం చేపడుతు న్నట్టు తెలిపారు. ఇందులో రూ.20 కోట్లను నూతక్కి రామకృష్ణప్రసాదు ప్రకటించారని, ఇప్పటికే రూ.8 కోట్లను అందజేశారని, మిగిలిన దాతలు దాదాపు రూ.7 కోట్లు వరకు అందించారని, దీంతో మొత్తం రూ.15 కోట్లు వరకు సేకరించామని వివరించారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ నూతన భవన సముదాయానికి దాతలు అండగా నిలబడాలని కోరారు. కార్యక్రమంలో సమితి ఉపాధ్యక్షుడు వడ్లమూడి నాగేంద్రం, సంయుక్త కార్యదర్శులు గుంటుపల్లి కోటేశ్వరరావు, ఎం.సీతారామయ్య, పాలకవర్గ సభ్యులు వి.శివరామకృష్ణయ్య, రాయపాటి గోపాలకృష్ణ, ఘంటా పున్నారావు, పెద్ది సాంబశివరావు, గౌరవ సలహాదారు కన్నెగంటి బుచ్చయ్యచౌదరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సామినేని కోటేశ్వరరావు, పాల్గొన్న పాలక వర్గ సభ్యులు

ప్రచార కార్యక్రమాలకు అనుమతి తప్పనిసరి

● జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమానికి నిర్ణీత దరఖాస్తులు సమర్పించి అనుమతులు తప్పక తీసుకోవలసి ఉందని జిల్లా ఎన్నికల అధికారి ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం కలక్టరేట్‌లో ఆయన అధ్యక్షతన ఎంసీఎంసీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రచార కార్యక్రమ ప్రీ సర్టిఫికేషన్ కోసం పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి వుందని జిల్లా ఎన్నికల అధికారి స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంసీఎంసీ సభ్యులు ఆర్డీఓ పి.శ్రీకర్, నోడల్ అధికారి గాలి దేముడు, సభ్యుడు ఎం.సాంబశివరావు, ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ రమేష్ చంద్ర, ఉపసంచాలకుడు, సమాచార పౌర సంబంధాల శాఖ అబ్దుల్ రఫీక్, టీడీపీ ప్రతినిధులు నవీన్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ఎంసీఎంసీ సమావేశంలో పాల్గొన్న కలెక్టర్

సమాజాన్ని జాగ్రుతం చేసేదే నాటకం

గుంటూరు, మార్చి 30: సమాజాన్ని జాగృతం చేసేదే నాటకమని ప్రముఖ సినీ, నాటక రంగ విశ్లేషకులు ఎ.అమరాచారి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శనివారం జరిగిన ప్రపంచ రంగస్థల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పలువురు రంగస్థల ప్రముఖులు, రచయితలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటకం సార్వజనీయం, సర్వకాలీనమని, ప్రాచీన కళల్లో బహుళ ప్రజాదరణ పొందిన వాటిల్లో నాటకం ప్రముఖమైందన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, ప్రముఖ నాటక రచయిత కావూరి సత్యనారాయణ, రచయిత్రి పింగళి భాగ్యలక్ష్మి, విశ్లేషకులు వివి రావు, రంగస్థల నటులు ఘనశ్యామాచార్యులు ఉన్నారు.

రూ.3.44 లక్షల నగదు స్వాధీనం

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శనివారం ఫ్లయింగ్ స్క్వాడ్‌లు నిర్వహించిన వాహన తనిఖీలలో రూ.3.44 లక్షల నగదు పట్టుబడింది. గుంటూరు పశ్చిమ పరిధిలో తగిన పత్రాలు లేకుండా తీసుకెళుతున్న రూ.2.44 లక్షలు, ప్రత్తిపాడులో రూ.లక్ష నగదుని సీజ్ చేశారు. దీంతో ఇప్పటివరకు పట్టుకొన్న నగదు మొత్తం రూ.1.29 కోట్లు దాటింది.

బీఆర్ స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తాం

● పెమ్మసాని చంద్రశేఖర్, నసీర్

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియాన్ని అంతర్జాతీయ స్థాయి గుర్తింపు వచ్చేల అభివృద్ధి చేస్తామని గుంటూరు పార్లమెంటు కూటమి అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్, తూర్పు అసెంబ్లీ అభ్యర్థి మొహమ్మద్ నసీర్ హామీ ఇచ్చారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని బీఆర్ స్టేడియాన్ని వారిరువురు శనివారం పరిశీలించారు. ఇండోర్ స్టేడియంతోపాటు బాస్కెట్‌బాల్ కోర్ట్, జిమ్ సెంటర్లను పరిశీలించి సదుపాయాలు, క్రీడాకారులు, వాకర్స్ ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ స్టేడియం అభివృద్ధి బాధ్యత టీడీపీ తీసుకుంటుందని, క్రికెట్ స్టేడియంతో పాటు, వాకర్స్, ఇతర క్రీడాకారులకు సంబంధించిన సౌకర్యాల కల్పనకు కూడా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే రెండవ పెద్ద స్టేడియం అయిన బీఆర్ స్టేడియం నేడు అధ్వానస్థితికి చేరుకుందని, నాలుగున్నర సంవత్సరాలుగా పట్టించుకోకుండా, ఒక్క రూపాయి కూడా నిధులు ఖర్చు పెట్టకుండా, ఎన్నికల కోడ్‌కు పది రోజులు ఉందనగా ప్రజలను మభ్య పెట్టేందుకు స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా పనులు మొదలు పెట్టాడని విమర్శించారు. స్టేడియాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో మెరుగులుదిద్ది అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

గుంటూరు తూర్పులో నూతన ఫ్రూట్ కాంప్లెక్స్ నిర్మిస్తాం

అనంతరం లాలాపేట ప్రాంతంలోని ఫ్రూట్ మార్కెట్ వ్యాపారస్తులను పెమ్మసాని, నసీర్‌లు కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సంద ర్భంగా వారు మాట్లాడుతూ గుంటూరు నగరంలో చిరు, పండ్ల వ్యాపారస్తులు వ్యాపారాలు చేసుకోవడానికి సరైన షాపులు లేక రోడ్లపై వ్యాపారం సాగిస్తున్నారని, ఎమ్మెల్యే ముస్తఫా 10 సంవత్సరాలుగా ఇటు వైపు కన్నెత్తి చూసింది లేదని విమర్శించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పండ్ల వ్యాపారస్తులకు ఫ్రూట్ కాంప్లెక్స్ నిర్మిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం గుంటూరు తూర్పు నియోజకవర్గ పరిధిలోని పెద్ద పులి సందులో వున్న 300 బెంగాలీ కుటుంబాలను కలసి వారి మద్దతు కోరారు. పిల్లలు చదువుకోవడానికి ఒక పాఠశాల ఏర్పాటు చేయాలని, ఓటర్లుగా తమ వారికి అవకాశం కల్పించాలని బెంగాలీ కుటుంబాల వారు కోరారు. కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నాయి.



బీఆర్ స్టేడియంలో సెల్ఫీ చాలెంజ్ చేస్తున్న పెమ్మసాని, నసీర్

ముస్లింలకు అన్నివిధాలా అండగా ఉంటా : పెమ్మసాని

గుంటూరు, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ముస్లింలకు అన్నివిధాలా అండగా ఉంటానని టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. గుంటూరులోని స్థానిక పొన్నూరు రోడ్లో గల లాల్ తలాబ్ మసీదులో జరిగిన రంజాన్ ఉపవాస దీక్ష విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మసీద్ మౌలానాలతో కలిసి నమాజ్ చేశారు. రంజాన్ మాసంలో కఠోర ఉపవాస దీక్షలతో ముస్లింలు పాటించే నియమ నిబంధనలు మానవాళికి మార్గదర్శకమని ఆయన చెప్పారు. గుంటూరు తూర్పు అభ్యర్థి మొహమ్మద్ నసీర్ కూడా పాల్గొన్నారు.

గంజాయి కేంద్రంగా నియోజకవర్గం : మొహమ్మద్ నసీర్

గుంటూరు తూర్పు నియోజకవర్గం గంజాయి కేంద్రంగా మారిపోయిందని టీడీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ అన్నారు. తూర్పు నియోజకవర్గంలోని సంగడిగుంట, ఎల్ఆర్ కాలనీ, ఐపీడీ కాలనీ, హుస్సేన్ నగర్‌లలో ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి ఆయన ఎన్నికల ప్రచార రోడ్ షోలో పాల్గొన్నారు. పెమ్మసాని మాట్లాడుతూ వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుబడిందన్నారు. నియోజకవర్గాన్ని వైసీపీ ఎమ్మెల్యే గంజాయి క్యాపిటల్‌గా మార్చాడని ఆరోపించారు. టీడీపీ వస్తే నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి పథంలో నిలుపుతామని నసీర్ హామీ ఇచ్చారు.

ప్రతి రోజూ న్యూరాలజీ ఓపీ సేవలు

గుంటూరు (మెడికల్) మార్చి 30 : గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి న్యూరాలజీ ఓపీ విభాగం ఇకపై వారంలో అన్ని రోజులు పని చేస్తుందని సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్‌కుమార్ తెలిపారు. సోమవారం నుంచి శనివారం వరకు ప్రతి రోజూ ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు న్యూరాలజీ ఓపీ సేవలు రోగులకు అందుబాట్లో ఉంటాయని ఆయన వివరించారు. నరాల సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్న రోగుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారంలో అన్ని రోజులు న్యూరాలజీ ఓపీ విభాగం పని చేసేలా నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. న్యూరాలజీ వైద్యనిపుణులతో పాటు 12 మంది న్యూరాలజీ పీజీ విద్యార్థులు అందుబాట్లో ఉండటంతో రోగులకు మెరుగైన సేవలు లభిస్తాయని డాక్టర్ కిరణ్‌కుమార్ వెల్లడించారు. కార్డియాలజీ ఓపీ కూడా సోమవారం నుంచి శనివారం వరకు అన్ని రోజులు పని చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వైసీపీ ప్రభుత్వంలో పేదలందరికీ న్యాయం

● మంత్రి విడదల రజనీ

గుంటూరు, మార్చి 30: వైసీపీ ప్రభుత్వంలో సమాజంలో పేదలందరికి న్యాయం జరుగుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ అన్నారు. చంద్రమౌళీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో టీడీపీ బ్రాహ్మణ సాధికార కమిటీ సభ్యుడు చింతపల్లి వెంకటరమణారావు తన అనుచరులతో మంత్రి సమక్షంలో శనివారం వైసీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి పార్టీ కండువాలతో సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బుద్ధా ఆంజనేయులు, అనఘా సుబ్రహ్మణ్యం, గన్నేపూడి రామలక్ష్మి, ఎల్లాప్రగడ వసుమతి, చింతపల్లి అనూరాధ, రాజ్యలక్ష్మి, చిలువూరి లక్ష్మి, టి.తురియాదేవి, షేక్ సలీం ఉన్నారు.

తూర్పులో నూరిఫాతిమా ఆధ్వర్యంలో చేరికలు

నగరంలోని రెండో డివిజన్ కార్పొరేటర్ మర్రి అంజలీ ఆధ్వర్యంలో టీడీపీ నుంచి ఖాదర్ బాషా, ఇతర యువజన నాయకులు వైసీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి నూరిఫాతిమా ఆధ్వర్యంలో శనివారం వైసీపీలో చేరారు. ఐదేళ్లలో చేసిన వైసీపీ సంక్షేమ, అభివృద్ధి పాలనకు మరోసారి పట్టం కట్టాలని ఆమె కోరారు.

వృద్ధులు, కార్మికులు తరచూ హెల్త్ చెకప్ చేయించుకోవాలి

● డీఆర్ఎం రామకృష్ణ

గుంటూరు, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వృద్ధులు, కార్మికులు రెగ్యులర్‌గా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడం మంచిదని గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ ఎం.రామకృష్ణ అన్నారు. శనివారం విజయవాడకు చెందిన సారా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టాభిపురంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులు, రైల్వే పోర్టర్లు, స్థానిక ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మందులు అందజేశారు. డీఆర్ఎం రామకృష్ణ మాట్లాడుతూ 40 ఏళ్ల వయస్సు దాటిన తర్వాత నుంచి ఆరోగ్యాన్ని ఎవరూ నిర్లక్ష్యం చేయరాదన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, ఫౌండేషన్ నేత కే.రేవంత్ కమలాకర్, రైల్వే మహిళ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు ఎం.ఆశలత, డాక్టర్ షేక్ ఎండీ అబుబాకర్, డీసీఎం కమలాకర్‌రావు పాల్గొన్నారు.

పాలిసెట్, ఏపీఆర్‌జేసీకి ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య), మార్చి 30 : రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్, ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో పదవ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు ఉచిత పాలీసెట్, ఏపీఆర్‌జేసీ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పిడికిటి తిలక్‌బాబు తెలియజేశారు. ఈ ఉచిత శిక్షణా తరగతులను ఏప్రిల్ 1 తేదీ నుంచి ప్రారంభిస్తున్నామని, ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యానగర్ మెయిన్ రోడ్, కొత్తపేట శివాలయం వీధిలో ఉన్న ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూలు బ్రాంచీలలో నిర్వహిస్తున్నామని, ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకులతో ప్రతిరోజూ రెండు గంటలు మ్యాథమాటిక్స్, ఒక గంట ఫిజిక్స్, ఒక గంట కెమిస్ట్రీతో సబ్జెక్టుల బోధనతో పాటు ప్రతిరోజూ 90 ప్రశ్నలతో కూడిన పరీక్ష, శిక్షణ కాలం పూర్తయ్యేలోపు ఆయా పరీక్షల మోడల్‌లోనే గ్రాండ్ టెస్టుల నిర్వహణ జరుగుతుందని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినీ, విద్యార్థులు 8309282408, 9866646712, 9959085200ల ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కల్లూరు సాంబశివరావు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

గుంటూరు(తూర్పు), మార్చి 30 : నిబంధనలు పాటించని ద్విచక్ర వాహన దారులపై రవాణ, ట్రాఫిక్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం అర్ధరాత్రి స్థానిక లక్ష్మీపురం ప్రధాన రహదారి వద్ద ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఓవర్ స్పీడ్, స్నేక్ డ్రైవింగ్, సైలెన్సర్‌లలో మార్పులు చేసి విపరీత ధ్వని చేస్తున్న ద్విచక్ర వాహన దారులను గుర్తించి 45 కేసులు నమోదు చేశారు. అనుమతి లేని సైలెన్సర్ ఏర్పాటు చేయడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా నడుపుతున్న ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. డీటీసీ కరీం, ట్రాఫిక్ డీఎస్పీ నాయుడు మాట్లాడు తూ రహదారి భద్రత నిబంధనలను ఉల్లంఘించే ద్విచక్ర వాహన దారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీలలో గుంటూరు, తెనాలి ఆర్టీవోలు గోపాల్, ప్రసాదు, మోటారు వాహన తనిఖీ అధికారులు మల్లీశ్వరీ, గంగాధర్ ప్రసాదు, సౌజన్య, రాఘవరావు, మధుసూదనరావు, ట్రాఫిక్ సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలు ప్రారంభం

గుంటూరు, మార్చి 30: క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పర్వదినాల్లో ఒకటైన ఈస్టర్ వేడుకలు శనివారం అర్ధరాత్రి పూజలతో జిల్లా వ్యాప్తంగా ఘనంగా ప్రారంభమయ్యాయి. చర్చిలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం అర్ధరాత్రి ఫిరంగిపురంలోని బాలయేసు దేవాలయంలో బిషప్ చిన్నాబత్తిని భాగ్యయ్య వేడుకలను ప్రారంభించి దివ్య బలి పూజ నిర్వహించారు. బిషప్ భాగ్యయ్య మాట్లాడుతూ క్రీస్తు మార్గాన్ని ప్రతి ఒక్కరు అనుసరించాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలోని రింగ్‌రోడ్డులో గల డాన్‌బాస్కోలోని నిత్య సహాయ మాత ఆలయం, స్తంభాలగరువులోని బాలయేసు దేవాలయం, ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న పునీత అగ్నేసమ్మ దేవాలయం, నగరంపాలెంలోని పునీత ఆంతోనివారి దేవాలయం, బొంగరాలబీడులోని లూర్థుమాత దేవాలయం, గోరంట్లలోని ఆరోగ్య మాత ఆలయం, అమరావతి రోడ్డులోని వేలాంగిణి మాత ఆలయం, ఈస్ట్, వెస్ట్, నార్త్, సౌత్ ప్యారిస్ చర్చిల్లోనూ, నగరంపాలెంలోని తెలుగు బాప్టిస్టు చర్చిల్లోనూ అర్ధరాత్రి ప్రార్థనలు జరిగాయి. నగరంలోని ఏఈఎల్‌సీ చర్చిలలో శనివారం అర్ధరాత్రి ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. లాడ్జి సెంటర్‌లోని నార్త్ ప్యారిస్ చర్చి, హిందూ కళాశాల వెనుక ఉన్న వెస్ట్ ప్యారిస్ చర్చి, పాత బస్టాండ్ వద్ద ఉన్న ఈస్ట్ ప్యారిస్ చర్చి, ఏటీ అగ్రహారంలోని సౌత్ ప్యారిస్ చర్చి, కొత్తపేట కుగ్లర్ ఆసుపత్రి ఆవరణలో, మాన్యం చర్చిలో భక్తులకు ఈస్టర్ సందేశమిచ్చారు.



స్తంభాలగరువు బాలయేసు చర్చిలో ప్రార్థనలు చేస్తున్న ఫాదర్ చిన్నాబత్తిని జోసఫ్ చార్లెస్

ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులకు ఆత్మీయ వీడ్కోలు



ఉద్యోగ విరమణ చేసిన పోలీస్ అధికారులను సత్కరిస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

గుంటూరు, మార్చి 30: జిల్లా పోలీసుశాఖలో పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన పోలీసులకు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆత్మీయ వీడ్కోలు పలికి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తూ ఎం.శ్రీనివాసరావు, ఏఆర్ ఎస్ఐ పి.సాంబశివరావులు ఉద్యోగ విరమణ చేశారు. వారిని సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ అన్ని ఉద్యోగాల్లో కంటే పోలీసు ఉద్యోగం చాలా ఒత్తిడితో, బాధ్యతతోనూ కూడుకున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ శాంత కుమార్, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, బ్రహ్మానందం, డి.శ్రీనివాసరావు, స్వర్ణలత, పోలీసు అసోసియేషన్ సభ్యులు మైలా సాంబశివరావు, హుస్సేన్, కరిముల్లా, లక్ష్మణ్, జానయ్య పదవీ విరమణ పొందిన పోలీసు అధికారుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన ఉండాలి

● కమిషనర్ కీర్తి చేకూరి



అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ కీర్తి చేకూరి

గుంటూరు (కార్పొరేషన్), మార్చి 30: ఎన్నికల విధులు కేటాయించబడిన అధికారులు ఈవీఎంల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఆర్ఓ కీర్తి చేకూరి తెలిపారు. శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఎన్నికల విధులు కేటాయించిన అధికారులు, సిబ్బందికి ఈవీఎంల నిర్వహణపై శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. కీర్తి మాట్లాడుతూ ఎన్నికల రోజు ఈవీఎంల్లో ఏ సమస్య ఎదురైనా తక్షణం పరిష్కరించేలా శిక్షణ పొందాలని అన్నారు. శిక్షణలో ఏఆర్ఓలు సునీల్, భీమరాజు, సెక్టోరల్ అధికారి శ్రీధర్, మేనేజర్ ఎస్.ఎన్.ప్రసాద్, సెక్టోరల్, రూట్ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

● స్థానిక ఏసీ కాలేజీలోని మీటింగ్ హాల్స్, తరగతి గదులను ఈవీఎంల కమిషనింగ్, పంపిణీ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల కోసం అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించి తగు ఆదేశాలు జారీ చేశారు.

రాత్రి 11 గంటల వరకు క్యాష్ కౌంటర్లు

గుంటూరు(కార్పొరేషన్), మార్చి 30: పన్ను బకాయి అంతా ఏకమొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు ఆదివారం (మార్చి31) తో ముగియనుందని, పన్ను చెల్లింపుదార్లకు వీలుగా ఉదయం 8 నుంచి రాత్రి 11 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పని చేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



SRI VENKATESWARA CREATIONS
"DIL" RAJU PRODUCTION
VIJAY DEVERAKONDA
THE FAMILY STAR
PARASURAM
RAJU SHIRISH VASUVARMA
IN THEATRES
APRIL 5
WORLDWIDE



PR FILMS
FROM THE DIRECTOR OF DORASAANI
ఏప్రిల్
5
విడుదల
IN THEATRES
భరతనాట్యం
BHARATHANATYAM
KVR MAHENDRA
PAYAL SARAF



NIZAM.. THRU..
NTR CINEMAS-9030161717
VIZAG
SRI VEERANJANEYA PICTURE
9290495533
EAST
ADITYA PRIME CINEMAS
9542551234
WEST
RAGHAVENDRA PICTURES
9392216151
KRISHNA
MURALI
9866010970
GUNTUR : ?
9182789051
NELLORE
ABHI CINEMAS
9866554495
CEDED
SANTHOSH FILMS
9550740062
WORLDWIDE
APRIL
05
IN THEATRES
బహుముఖం
GOOD, BAD & THE ACTOR
HARSHIV KARTHIK



మలయాళంలో 200 కోట్లు సాధించిన
మంజుమ్మల్ BOYS
ఇప్పుడు తెలుగులో ఏప్రిల్ 6న విడుదల
CHIDAMBARAM
BABU SHAHIR, SOUBIN SHAHIR, SHAWN ANTONY



SK BASHEED
IN THEATRES
APRIL
06
ప్రాజెక్ట్ Z
S.K. KARIMUNNISA
C.V. KUMAR
SBK FIIMS CORPORATION : 9652052424 | 9550819036



AMIGOS CREATIONS Pvt. Ltd.
a Sekhar Kammula film
హ్యాపీ డేస్
APRIL
12TH
RE-RELEASE
AP-TS-BENGALURU
RELEASE BY
GLOBAL CINEMAS



STAR BOY
SHATTERING RECORDS
అట్లుంటది మనతోని
SITHARA ENTERTAINMENTS
SRIKARA STUDIOS
FORTUNE FOUR CINEMAS
'STAR BOY' SIDDU IN
(TILLU)²
MALLIK RAM
SURYADEVARA NAGA VAMSI



SUPER HIT ALL OVER INDIA
The GOATLIFE
ఆడుజీవితం
A BLESSY FILM
AN A R RAHMAN MUSICAL
TELUGU KANNADA HINDI TAMIL MALAYALAM

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

● మున్సిపల్ కమిషనర్ శేషన్న



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న, పక్కన అసిస్టెంట్ కమిషనర్, సీడీపీవో

తెనాలి, మారీసుపేట, మార్చి 27: ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోవాలని మున్సిపల్ కమినర్ బి.శేషన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు, రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అంగనవాడీ కార్యకర్తలకు మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఓటు హక్కు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, సీడీపీవో సునీత, అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు జడ్ సుధాకర్, ఎస్ఎల్ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఏ రామచంద్రరావు, డి శ్రీనివాసరావు, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లుల చెల్లించవచ్చు

తెనాలి అర్బన్, మార్చి 30: పట్టణంలో విద్యుత్ బిల్లుల ఆదివారం సెలవు రోజు అయినప్పటికీ చెల్లింపు చేయవచ్చని ఏడీఈ అశోక్ తెలిపారు. అందుకు ఏర్పాట్లు చేశామని వినియోగదారులు బిల్లులు చెల్లించి సహకరించాలని కోరారు.

దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు

కొల్లిపర, మార్చి 30: మండలంలోని మున్నంగి సమీపంలో కృష్ణానది కరకట్ట వద్ద శుక్రవారం జరిగిన ఇసుక తరలింపు విషయంలో ఎస్సీ వర్గాలు జరుపుకున్న పరస్పర దాడులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రవీంద్రరెడ్డి శనివారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మున్నంగి కాలనీకి చెందిన వేమూరి బాలరాజు, వేమూరి అశోక్, వేమూరి రాజేష్ తదితరులు ఇసుక తవ్వకాలు జరిపితే భూగర్భజలాలు అడుగంటుతున్నాయని తవ్వకాలు నిలిపివేయాలంటూ ట్రాక్టర్లను, లారీలను ఆపగా రీచ్ వద్ద పనులు చేస్తున్న అదే గ్రామానికి చెందిన వేమూరి మోషయ్య, వేమూరి చింతయ్య, వేమూరి అంజిలు లారీలు ఆపవద్దంటూ వారిపై దాడికి దిగారు. ఈ నేపథ్యంలో ట్రాక్టర్‌తో ఎదుటి వారిని తొక్కించటానికి ప్రయత్నం చేయటం, కత్తులు, రాడ్లతో దాడి చేయడం సంఘటనలో ఇరువర్గాలు గాయపడ్డారు. ఈ సంఘటనపై ఇరువర్గాలు ఫిర్యాదులు చేసుకోవటంతో కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

● తహసీల్దార్ శ్రీనివాసులు

కొల్లిపర, మార్చి 30: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఓటు వినియోగంపై అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అన్నారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తును మార్చేది ఓటు మాత్రమేనన్నారు. సదస్సులో ఆర్ఐ శ్రీనివాసరావు, సీనియర్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, బీఎల్వోలు, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ శారద సేవలు అభినందనీయం

● డీఎంహెచ్‌వో విజయలక్ష్మి



డాక్టర్ శారదను సన్మానిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయలక్ష్మి

తెనాలి అర్బన్, మార్చి 30: డాక్టర్ శారద సమాజానికి అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆమె మరెందరికో ఆదర్శం కావాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి కె.విజయలక్ష్మి చెప్పారు. వహాబ్ రోడ్డులోని శారదా సర్వీస్ సొసైటీలో శనివారం జాతీయ డాక్టర్ల దినోత్సవం నిర్వహించారు. పెన్నీ మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ, కరోనా కష్టకాలంలో ఎంతోమంది ప్రాణాలు కాపాడి పరికరాలు కూడా ఉచితంగా అందించారని అభినందించారు. ప్రతినెలా పేదలకు వైద్య శిబిరాలు నిర్వహించి ఆదుకుంటున్నారని చెప్పారు. గుండెపోటు రోగుల కోసం ఏర్పాటుచేసిన ఐసీయూ, ఎంతోమంది మహిళలకు క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేసి ప్రాణహాని నుంచి కాపాడారన్నారు. డాక్టర్ శారద మాట్లాడుతూ, తాను బతికి ఉన్నంత కాలం సమాజ సేవకు అంకితమవుతానన్నారు. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్



ఐఎస్‌వో సర్టిఫికెట్ అందుకుంటున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

తెనాలి అర్బన్, మార్చి 30: ఏఎస్ఎన్ ఫార్మసీ కళాశాలకు ఐఎస్‌వో 9001-2015 సర్టిఫికెట్ లభించింది. ఐఎస్‌వో రెన్యూవల్‌లో భాగంగా తనిఖీచేసిన బృందం పరీక్షల ఫలితాలు, లేబొరేటరీ నిర్వహణ, తరగతి గదులు, డిజిటల్ విధానాన్ని పరిశీలించారు. ఐఎస్‌వో ఇన్‌స్పెక్టర్ కుటుంబరావు, సింగయ్య సర్టిఫికెట్‌ను శనివారం కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరమణకు అందజేశారు. ఐఎస్‌వో గుర్తింపు మూడు సంవత్సరాల పాటు వర్తిస్తుందన్నారు. సాయిరాజేష్, లక్ష్మీదుర్గ, కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు లభించడంపై కళాశాల కరస్పాండెంట్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అధ్యాపకులను అభినందించారు.

ఎన్నికల్లో సైనికుల్లా పోరాడితేనే గెలుపు

మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, మార్చి 30: వైసీపీ అరాచకపాలనకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైంది. మరో 40 రోజుల్లో ఎన్నికలు రానున్నాయి. గతంలో జరిగిన పొరపాట్లకు తావులేకుండా ఉమ్మడి అభ్యర్థుల గెలుపునకు పార్టీ శ్రేణులందరూ సైనికుల్లా పనిచేయాలని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించి రానున్న ఎన్నికలపై పార్టీ శ్రేణులతో చర్చించి పలు సూచనలు చేశారు. పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, జొన్నాదుల మహేష్, పాలడుగు ప్రణీత్, అనిత, బోయపాటి అరుణ, జెట్టి రేణుక, పరుచూరి రమ్య, కొండారమాదేవి, పలువురు పార్టీ శ్రేణులు, తెలుగు మహిళలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబసభ్యులకు ఆలపాటి పరామర్శ

తెనాలి రూరల్, మార్చి 30: మండలంలోని అంగలకుదురులో ఆటో ఢీకొని చికిత్సపొందుతూ మృతిచెందిన పెండ్యాల వెంకయ్య కుటుంబసభ్యులను మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ శనివారం పరామర్శించారు. కుటుంబసభ్యులకు తన ప్రగాఢసానుభూతిని తెలిపి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పలువురు టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

లక్ష్మీతిరుపమ్మతల్లిని దర్శించుకున్న ఆలపాటి



భరతనాట్యం ప్రదర్శించిన చిన్నారులతో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్,మార్చి 30: పట్టణంలోని నాజరుపేటలో నిర్వహిస్తున్న గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ తల్లి తిరునాళ్లను పురస్కరించుకుని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో శ్రీలక్ష్మీనారాయణ కళానికేతన్ శిష్యబృందం ప్రదర్శించిన చిన్నారుల భరతనాట్యాన్ని తిలకించి వారిని అభినందించారు. కార్యక్రమంలో నిర్వాహక కమిటీ సభ్యులు, పార్టీ శ్రేణులు, భక్తులు పాల్గొన్నారు.

తెనాలి ప్రాంతాన్ని ప్రగతిపథంలో నడిపిస్తా

● ఆత్మీయ సమావేశంలో నాదెండ్ల మనోహర్



మేనిఫెస్టో క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న నాదెండ్ల మనోహర్, వీరవల్లి మురళి, నాగభూషణం తదితరులు

తెనాలి రూరల్, మార్చి 30: రానున్న ఎన్నికల్లో విజయం సాధించి ప్రజలందరితో కలిసి తెనాలి ప్రాంతాన్ని ప్రగతి పథంలో నడిపిస్తానని జనసేన పీఏసీ చైర్మన్, టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని అంగలకుదరులో గణేష్‌యూత్ కన్వీనర్, టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, గ్రామ ఉపసర్పంచ్, టీడీపీ నాయకులు కనగాల నాగభూషణం, గ్రామ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి నాదెండ్ల మనోహర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభకు సీనియర్ టీడీపీ నాయకులు, న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ అంగలకుదురు గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు గతంలో తాను అధికారంలో ఉన్నప్పుడు అనేక విధాలుగా ప్రయత్నించిన విషయాన్ని గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రం అదోగతిపాలైందని కనీసం రోడ్లు కూడా బాగుచేయించలేకపోయారంటే రాష్ట్ర ప్రజలపై ఉన్న చిత్తశుద్ధి జగన్ ప్రభుత్వానికి ఏ పాటిదో ప్రజలందరూ అర్థం చేసుకోవాలన్నారు. ఒక్క చాన్స్ అంటూ కోరిన జగన్ 151మందిని ప్రజలు గెలిపిస్తే రాష్ట్రాన్ని ఏ విధంగా దిగజార్చారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదన్నారు. తెనాలి నుంచి మంగళగిరికి నాలుగు లైన్ల రహదారిగా మార్చేందుకు అప్పట్లో తాను ఎంతో కృషి చేశానని వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ రోడ్డు ఏర్పాటు పనులను పక్కన పెట్టిందని ఆరోపించారు. అంగలకుదురు గ్రామంలో జేఎంజే కళాశాల వద్ద ఉన్న డ్రెయిన్‌ను ఆధునికీకరించి గ్రామస్థులకు మంచి జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా రింగ్‌రోడ్డు పనులు కూడా ప్రారంభించి ట్రాఫిక్‌రహిత పట్టణంగా తీర్చిదిద్దుతానన్నారు. వీరవల్లి మురళి, కనగాల నాగభూషణంలు గ్రామాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఎవ్వరైనా తనను నేరుగా కలవవచ్చని మంచి జరిగే విషయమైతే తాను ముందుండి నడిపిస్తానని హామీ ఇచ్చారు. ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఈ ప్రాంత అభివృద్ధికి ముందుకు వెళ్లనున్నట్లు ఆయన స్పష్టం చేశారు. గత ఐదేళ్లగా పార్టీ కేడర్‌పై జరిగిన దాడులు, అక్రమ కేసులకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఎంపీ అభ్యర్థిగా పోటీ చేయనున్న పెమ్మసాని చంద్రశేఖర్‌ను సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని, తనను గాజు గ్లాసు గుర్తుపై ఓటువేసి గెలిపించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు. తొలుత సూపర్‌సిక్స్ పథకాల క్యాలెండర్‌ను నాదెండ్ల మనోహర్ పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. గణేష్ యూత్ తరుపున నాదెండ్ల మనోహర్‌ను వీరవల్లి మురళి, నాగభూషణంలో ఘనంగా సత్కరించారు. అన్నాబత్తుని జయలక్ష్మి, జెట్టిరేణుక, అంగలకుదురు గ్రామ సర్పంచ్ ఊసరవు రాజ్యలక్ష్మి, గ్రామ పార్టీ అధ్యక్షుడు కనగాల శ్రీనివాసరరావు, పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావు మృతి బాధాకరం

మండలంలోని అంగలకుదురులో గురువారం రాత్రి రోడ్డుదాటుతూ ఆటో ఢీకొన్న ప్రమాదంలో మరణించిన పెండ్యాల వెంకటేశ్వరరావు మృతి తనకు ఎంతో బాధ కలిగించిందని జనసేన పీఏసీ చైర్మన్, టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం మండలంలోని అంగలకుదురులో మృతుడు పెండ్యాల వెంకటేశ్వరరావు ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ తరుపున కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానని మనోహర్ హామీ ఇచ్చారు. పలువురు టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

గ్రామస్థుల అభిమానాన్ని మరువలేను

మండలంలోని సంగంజాగర్లమూడి గ్రామస్థుల తనపై చూపుతున్న అభిమానాన్ని ఎన్నటికీ మరువలేనని ఉమ్మడి పార్టీ అధికారం చేపట్టిన తరువాత గ్రామానికి మంచి చేసి గ్రామస్థుల రుణం తీర్చుకుంటానని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి ఉమ్మడి పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం నాదెండ్ల మనోహర్ ఉమ్మడి పార్టీ శ్రేణులతో కలిసి మండలంలోని సంగంజాగర్లమూడిలో పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ గ్రామస్థుల యోగక్షేమాలు విచారించి ఎన్నికల మేనిఫెస్టోలోని పలు అంశాలను వివరించారు. గణేష్‌యూత్ కన్వీనర్ టీడీపీ సీనియర్ నాయకులు వీరవల్లి మురళి, కనగాల నాగభూషణం, అన్నాబత్తుని జయలక్ష్మి, గ్రామజనసేన, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

సాదాసీదాగా మున్సిపల్ సర్వసభ్య సమావేశం



కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, వార్డు సమస్యలను తెలుపుతున్న టీడీపీ కౌన్సిలర్ అరుణ

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 30: పట్టణంలోని అన్ని వార్డులలో దోమల బెడద ఎక్కువగా ఉన్నదని, మున్సిపల్ అధికారులు దోమల నివారణకు చర్యలు చేపట్టాని, ఫాగింగ్‌ను సక్రమంగా నిర్వహించాలని అధికార పక్ష, విపక్ష సభ్యులు డిమాండ్ చేశారు. తెనాలి కౌన్సిల్ సాధారణ, ప్రత్యేక సమావేశాలు శనివారం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన జరిగాయి. ఉదయం 11 గంటలకు సాధారణ సమావేశం మొదలయితే, దీనికి సంబంధించిన 2వ అంశంపై చర్చ జరుగుతుండగా 25వ వార్డు స్వపక్ష కౌన్సిలర్ తాడిబోయిన రామయ్య మాట్లాడుతూ జీవో నెంబర్ 279 అమలులో ఉందా అనేది తెలియజేయాలని కోరారు. జీవో అమలులో లేదని కమీషనర్ శేషన్న తెలిపారు. వార్డులో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగడంలేదని, దీనివల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని రామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. దానికి కారణం కొంతమంది పారిశుధ్య కార్మికులు పదవీ విరమణ చేశారని, పట్టణ విస్తీర్ణం పెరిగింది, జనాభా 2011లో సుమారు 1 లక్ష 64వేల మంది ఉండగా 2024కి 2 లక్షల20 వేల మంది పెరిగారన్నారు. వారికి అనుగుణంగా నగర దీపికలను, పారిశుధ్య కార్మికులను పెంచాలని సూచించారు. చైర్‌పర్సన్ రాధిక స్పందిస్తు ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. కమిషనర్ బి శేషన్న సమాధానమిస్తు ఫాగింగ్‌చేసి దోమలను నివారిస్తామని తెలిపారు. ఇదే సందర్భంలో 27వ వార్డు టీడీపీ కౌన్సిలర్ బోయపాటి అరుణ మాట్లాడుతూ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక అన్ని వార్డులలో పర్యటించి తెలుగుదేశం వార్డు అవ్వటం వలన తన వార్డులో పర్యటించలేదని విమర్శించారు. గత 30రోజుల నుంచి పారిశుధ్య కార్మికులు వార్డులో మురుగు తీయడంలేదని, చెత్తచెదారం, మురుగు ఎక్కువైపోయి దోమలు విపరీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రాధిక స్పందిస్తు ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున వార్డు పర్యటనలకు రావడం లేదని అధికారులను, కార్మికులను పంపి సమస్యను పరిష్కరిస్తానన్నారు. పలువురు అధికార, విపక్ష సభ్యులు తమ వార్డు సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా కోడ్ అమలులో ఉన్నందున అవకాశమున్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు. శాంతించని ఆమె వాదనకు దిగగా టీడీపీ కౌన్సిలర్ అన్నం పిన్నారావు సర్దిచెప్పారు. చివరకు కమిషనర్ శేషన్న కలుగచేసుకొని మీ వార్డుకు వస్తానని, సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పలువురు అధికార, విపక్ష సభ్యులు తమ వార్డు సమస్యలను చైర్‌పర్సన్ దృష్టికి తీసుకురాగా కోడ్ అమలులో ఉన్నందున అవకాశమున్న సమస్యలను అధికారులతో చర్చించి పరిష్కరిస్తానని తెలిపారు. అనంతరం ఎజండాలోని అన్ని అంశాలను ఆమెదించినట్లు చైర్‌పర్సన్ రాధిక ప్రకటించారు. ఈ సమావేశంలో అసిస్టెంటు కమీషనర్ అనూష, ఇన్‌చార్జి ఎంఈ శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్‌లు, కో అప్షన్ సభ్యులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



సంస్మరణ సభలో మాట్లాడుతున్న రాజగోపాల్

ఓ పాత్రుడు నవలపై చర్చా వేదిక

తెనాలి అర్బన్, మార్చి 30: స్థానిక కవిరాజా పార్కులో రచయిత పతంజలి రచించిన ఓ పాత్రుడు నవలపై శనివారం చర్చావేదిక నిర్వహించారు. సాంస్కృతిక వేదిక భిన్న స్వరాలు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి జీఎస్ నాగేశ్వరరావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఆహ్వానం లక్ష్మి సంస్మరణ పేరిట ప్రతి నెలా ఒక చర్చావేదిక నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సాహిత్య విమర్శకుడు గుంటూరు లక్ష్మీనరసయ్య, జిడుగు పత్రిక సంపాదకుడు రాజగోపాల్, నవలా విశేషాలను చర్చించారు. ప్రస్తుతం సమాజం సత్యానంతర యుగంలో ఉందన్నారు. విశ్వజనిన సత్యమంటూ ఉండటానికి వీలు లేని సమాజంలో బ్రతుకుతున్నామని రచయిత నవలలో బాగా విశ్లేషించారని వక్తలు పేర్కొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తెనాలి, మారీసుపేట ఫిబ్రవరి 30: పట్టణంలోని ఎన్‌డీ కాలనీలోని మున్సిపల్ ఉర్దూ పాఠశాలలో శనివారం శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో యోగా సభ్యులు యడ్ల వెంకటకృష్ణ, మంజూషల కుమార్తెలు విశ్వజ్ఞశ్రీ సత్య, విధాన్‌శ్రీ సత్యల పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులను పంపిణీచేశారు. ముందుగా జన్మదిన కేక్‌ను కట్‌చేసి విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమాలో ఎస్‌వీ యోగా కన్వీనర్ రమణయ్య పాఠశాల ఉపాధ్యాయులు బి.మాధవి, బి సుజాత, వి అనూష, యోగ సాధకులు పాల్గొన్నారు.

32 మంది ఏఎస్ఎన్ డిగ్రీ విద్యార్థులకు ఉద్యోగాలు

తెనాలి అర్బన్, మార్చి 30: ఏఎస్ఎన్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ప్రాంగణ ఎంపికలో 32మందికి ఉద్యోగాలు లభించాయని కరస్పాండెంట్, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. ఫైనాన్స్ సంస్థ ఫిరామిల్ ఫైనాన్స్ లిమిటెడ్ ప్రతినిధులు కళాశాలలో ప్రాంగణ ఎంపిక నిర్వహించారని చెప్పారు. జూన్ నెలలో శిక్షణ ఇచ్చిన అనంతరం ఉద్యోగంలో చేర్చుకుని నెలకు 21 వేలు వేతనం అందిస్తారని తెలిపారు. ఐటీసీ కంపెనీ తమ కళాశాల విద్యార్థి దినేష్ సత్యసాయిని రూ.4.40 లక్షల వార్షిక ప్యాకేజీతో ఉద్యోగానికి ఎంపిక చేసిందన్నారు. ఎంపికైన విద్యార్థులను శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. ప్రిన్సిపాల్ కె.రాంచంద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైసీపీ అభ్యర్థులను గెలిపించాలి

● వైసీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి కిలారి రోశయ్య

కొల్లిపర, మార్చి 30: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని వైసీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి రోశయ్య విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక జీవీఆర్ కల్యాణ మండపంలో నాయకులతో, కార్యకర్తలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సమావేశానికి వైసీపీ మండల కన్వీనర్ అవుతు పోలిరెడ్డి అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నకు అండగా నిలబడాలన్నారు. సమావేశంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.శివారెడ్డి, నాయకులు బి.సంజీవరెడ్డి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కలిసికట్టుగా పనిచేయాలని వైసీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి, పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. శనివారం పట్టణంలోని ఎన్జీవోస్ కల్యాణమండపంలో తెనాలి మండల గ్రామాల్లోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్యనాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎమ్మెల్యే శివకుమార్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వివేక స్కూల్ గ్రాడ్యుయేషన్ డే

తెనాలి అర్బన్, మార్చి 30: శాస్త్ర, సాంకేతిక రంగాలలో దేశాభివృద్ధి సాధ్యమవుతుందని విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే ఉన్నత స్థానం చేరతారని విద్యావేత్త విశ్రాంత అధ్యాపకులు ఆంజనేయులు చెప్పారు. వివేకానంద సెంట్రల్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్స్ నిర్వహించారు. 1 నుంచి 11వ తరగతి వరకు సదరు విద్యార్థులకు ప్రత్యేక దుస్తులతో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారతీయ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులు ఏ స్థాయికి చేరిన మరిచిపోకూడదని చెప్పారు. సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండాలని, నైపుణ్యాల సాధనపై దృష్టి సారించాలని, అప్పుడే తమ తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చగలరని చెప్పారు. డాక్టర్ జీవనలత, డైరెక్టర్ రావిపాటి వీరనారాయణ, డాక్టర్ రవీంద్రనాథ్, కె.రామరాజు, సీఈవో వెంకటరామ్, ప్రిన్సిపల్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో గిరిజన, యానాదులకు అన్యాయం: టీడీపీ నాయకులు

పెదకాకాని, మార్చి 30: గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గిరిజన, యా నాదులకు తీరని అన్యాయం చేసిందని టీడీపీ నాయకులు ఆరోపించారు. శని వారం పొన్నూరు నియోజకవర్గంలో ఉన్న గిరిజన యానాదుల నాయకులు టీడీపీ మండల ఆఫీసులో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో ఎస్టీలకు రావాల్సినటువంటి సబ్‌ప్లాన్ నిధులను ఈ ప్రభుత్వం దుర్వినియోగం చేసి పేదలను మోసం చేసిందని అన్నారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు రాబోయే ఎన్నికల్లో ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను అత్యధికమైన ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వలివేటి మురళీకృష్ణ, తెలుగుయూత్ అధ్యక్షుడు మేడ వెంకటకృష్ణ, ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి యేసుబాబు, టి.శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, కె.చెంచయ్య, తట్టా బుల్లయ్య తుపాకుల రమేష్, పొన్నూరు సుబ్బారావు, తలుపుల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో కౌంటింగ్ కేంద్రాల పరిశీలన



ఏఎన్‌యూలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

పెదకాకాని, మార్చి 30: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, ఎస్పీ తుషార్‌డూడీ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికలు-2024 నేపథ్యంలో జిల్లాలోని ఏడు శాసనసభ స్థానాలు, ఒక పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి ఓటింగ్ అనంతరం ఈవీఎంల భద్రత ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై శనివారం ఏఎన్‌యూలోని పలు విభాగాల వారిరువురు పరిశీలించారు. ఎన్నికల కమిషన్ జారీచేసిన మార్గదర్శకాల ప్రకారం ఈవీఎం, ఇతర అనుబంధ యూనిట్లు భద్రపరిచే స్ట్రాంగ్‌రూమ్ వద్ద కట్టుదిట్టమైన భద్రతతో పాటు, ఇతర రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ కేంద్రాలలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పరిశీలన కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులైన సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ రాజ్యలక్ష్మి, ఆర్డీవో పి.శ్రీఖర్, ఏడీ సర్వే నాగేషు, పెదకాకాని తహసీల్దార్ రత్నం, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో ప్రజలపై పన్నుల భారం: ధూళిపాళ్ళ



25వ వార్డులో పర్యటిస్తున్న ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్, మార్చి 30: ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై పన్నుల భారం మోపటం తప్ప చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ఆరోపించారు. పట్టణంలోని 25వ వార్డు ఎస్టీ కాలనీలో శనివారం నరేంద్రకుమార్ పర్యటించి ఇంటింటికి వెళ్లి స్థానికులను కలుసుకొని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ కరపత్రాలను పంచిపెట్టారు. మినిమ్యానిఫెస్టోలో పొందుపరిచిన సూపర్ 6 పథకాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ జగన్ పాలన ప్రజలకు కంటకంగా మారిందన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే పేదల సంక్షేమం కోసం పాటపడతామని హామీ ఇచ్చారు. ప్రజలు కూడా విజ్ఞతతో ఆలోచించి తమ అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేసే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థుల విజయానికి పాటపడాలని పిలుపునిచ్చారు. అలాగే చేబ్రోలులోని గోళ్లపాలెం, గౌడపాలెం, శాలిపేట, ఉప్పరపాలెం, ముట్లూరు రోడ్డు, పాతరెడ్డిపాలెం, కాలేజి బజార్ తదితర ప్రాంతాల్లో టీడీపీ జనసేన సంయుక్త ఆధ్వర్యంలో నరేంద్రకుమార్ ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. చేబ్రోలులోని తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త వడ్రాణం మార్కండేయ బాబు, టీడీపీ, జనసేన మండల అధ్యక్షుడు మైలా వెంకటరామరాజు, చెందు శ్రీరాములు, చేబ్రోలు అధ్యక్షుడు వి.కొండారెడ్డి, గట్టుపల్లి సుజిత్, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠ

పొన్నూరు టౌన్, మార్చి 30: మండల పరిధిలోని చింతలపూడిలో శనివారం కోదండ రామాలయ ప్రతిష్ఠ మహోత్సం భక్తి శ్రద్ధలతో సాగింది. విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేద పండితులు మంత్రోచ్ఛారణల నడుమ మూలవిరాట్‌లను ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో ధూళిపాళ్ళ నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

పొన్నూరు టౌన్, మార్చి 30: మద్యం విక్రయిస్తున్న మహిళను అరెస్టు చేసినట్లు అర్బన్ ఎస్ఐ ఎం.రాజ్‌కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని వీవర్స్‌కాలనీ వద్ద సోదాలు నిర్వహిస్తున్న జొన్నాదుల పద్మ అనే మహిళ నుంచి 9మద్యం బాటిళ్లు స్వాధీనం చేసికొని అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏసు పునరుద్ధానుడైన రోజే ఈస్టర్

● ప్రొఫెసర్ జోసఫ్ ప్రకాష్

చేబ్రోలు, మార్చి 30: శిలువ వేయబడి ఏసు సజీవుడిగా పునరుద్ధానుడైన రోజునే ప్రపంచం అంతా ఈస్టర్ పర్వదినాన్ని నిర్వహించుకుంటుందని జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ జోసెఫ్ ప్రకాష్ మోసిగంగి శనివారం ప్రకటనలో తెలిపారు. ఈస్టర్ సందేశాన్ని తెలుపుతూ శిలువ వేయబడిన తర్వాత మూడోరోజు సమాధి నుంచి లేచి మొదటిగా శిష్యులకు, తర్వాత 40 దినాల పాటు అనేక మందికి ఏసు కనపడ్డారన్నారు. నిరాశ నిస్పృహలకు గురైన వారితోనూ, సర్వమానవాళితో ఆయన మాట్లాడుతూ ఆదరిస్తూ ముందుకు సాగుతున్నాడని తెలిపారు. ప్రజలందరికీ ఈస్టర్ డే శుభాకాంక్షలు తెలియజేశారు.

8న బాజీబాబా ఉరుసు మహోత్సవం

● గోడపత్రికలను ఆవిష్కరించిన ఈవో ముక్తార్‌బాషా

పెదకాకాని, మార్చి 30: పెదకాకానిలో ఉన్న హజరత్‌సయ్యద్ బాజీషాహిద్ ఆవులియా బాబా వారి 536వ ఉరుసు మహోత్సవం ఏప్రిల్ 8న రాష్ట్ర వక్ఫ్ బోర్డు వైభవంగా నిర్వహించనున్నట్లు దర్గా ఈవో ముక్తార్‌బాషా, అసిస్టెంట్ సెక్రటరీ సయ్యద్ ఆదాం షఫీలు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో భక్తులు కనీస సౌకర్యాలు లేక ఇబ్బందులు పడేవారని అన్నారు. ప్రస్తుతం ఉన్నతాధికారుల సహాయ, సహకారాలతో సుమారు రూ.రెండు కోట్లతో దర్గా చుట్టూ ప్రహరీ, దర్గా నుంచి గేటు వరకు సీసీ రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా పెదకాకాని కెనరా బ్యాంక్ వారి సహకారంతో జనరేటర్ అందించినట్లు తెలిపారు. సుమారు 1000మంది భక్తులు విశ్రాంతి తీసుకునేందుకు షెడ్డు, మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉన్నతాధికారులు ఇంకా సహాయ సహకారాలు అందించే సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు గదులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అనంతరం ఉరుసు మహోత్సవం గోడ పత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో దర్గా సిబ్బంది సత్తార్, రఫి, నాగభూషణం, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.